జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, ఫిబ్రవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం


## ప్రజాస్వామ్య దేశంలో ఓటే ఆయుధం



- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన సీఎం, మంత్రి నారా లోకేష్

**ఉండవల్లి:** ప్రజాస్వామ్య దేశంలో ఓటే అతిపెద్ద ఆయుధం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అభిప్రాయాన్ని తెలపడానికి, ప్రజాస్వామ్యాన్ని చైతన్య పరచడానికి ఓటు ద్వారా అవకాశం కలుగుతుందన్నారు. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఉండవల్లిలోని గాదె రామయ్య-సీతారావమ్మ ఎంపీయూపీ స్కూల్ బూత్‌లో మంత్రి నారా లోకేష్‌తో కలిసి వెళ్లి ఓటు వేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఓటు వేయడం అందరి బాధ్యత అని, దాన్ని హక్కుగా వినియోగించుకోవాలని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం, దేశ ప్రతిష్టకు ఓటు బలంగా పని చేస్తుందని అన్నారు.








మహానాడు ఫోకస్

# అందుకే ఏబీ ఆ పదవి తీసుకోలేదా?

- రెండు పోస్టులూ ఉంటేనే స్వేచ్ఛ ఉంటుదని ఏబీ భావన
- తాజా జీవీ రెడ్డి ఎపిసోడ్‌తో ఏబీ వైఖరి స్పష్టం
- ఎండీతో విబేధించి పార్టీ నుంచి వెళ్లిపోయిన జీవీ రెడ్డి
- అలాంటి అనుభవాన్ని ఏబీ ముందే ఊహించారా?
- అందుకే చైర్మన్ పదవి తీసుకోకుండా మౌనంగా ఉన్నారా?
- సీఎంఓ అధికారులకు ఆపాటి తెలివి లేదా?
- పార్టీ-ప్రభుత్వంలో అసలు ఏ జరుగుతోంది?
- నేతలను పిలిచి మాట్లాడే సంస్కృతికి పాతర
- పార్టీ-ప్రభుత్వంలో అసలు నిర్ణయాధికారం ఎవరిది?
- టీడీపీ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ

- ఏబీకి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఇచ్చిన బాబు
- అయినా ఇప్పటిదాకా తీసుకోని ఏబీ వెంకటేశ్వరరావు
- చైర్మన్ ఏబీకి బాసుగా ఐజి స్థాయి అధికారి
- చైర్మన్-ఎండీగా ఇవ్వకపోవడమే ఏబీ అసంతృప్తికి కారణమా?

(మార్తి సుబ్రహ్మణ్యం)

పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు.. ఇప్పటివరకూ ఆ పదవి తీసుకోకుండా హైదరాబాద్ వెళ్లిపోవడానికి తెరవెనక కారణాలపై, పార్టీ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. జగన్ వేధింపులకు భయపడకుండా ధైర్యంగా ఆయనపై న్యాయపోరాటం చేసి, లక్షలాదిమంది అభిమానులను సంపాదించుకున్న ఏబీ స్థాయికి.. ప్రభుత్వం ఇచ్చిన కార్పొరేషన్ చైర్మన్ చాలా చిన్నదన్న అభిప్రాయం టీడీపీ వర్గాల్లో చాలాకాలం నుంచి ఉన్నదే.

జగన్‌కు ఒక్కసారి కూడా ఎదురుపడి సెల్యూట్ కొట్టని ఏకైక అధికారిగా రికార్డు సృష్టించిన మాజీ డీజీ ఏబీ వెం టేశ్వరరావు.. జీవీ రెడ్డి అనుభవం తనకూ ఎదురవుతుందన్న ముందుచూపుతోనే, తనకు ఇచ్చిన పదవిని తీసుకోకుండా మౌనంగా ఉన్నారన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. నిజానికి పోలీసు కార్పొరేషన్ చైర్మన్ ఏబీ స్థాయికి చిన్నది అయినప్పటికీ, దానితో పాటు ఎండి పదవి కూడా ఇచ్చి ఉంటే హుందాగా ఉండేదంటున్నారు.

రెండు పదవులున్న కార్పొరేషన్ పదవి తీసుకున్న ఒదున దానివల్ల పెద్ద ఉపయోగం లేకపోయినప్పటికీ, నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. డీజీగా రిటైరయిన ఏబీపై, ఐజి స్థాయి అధికారిని ఎండీగా నియమిస్తే ఆయన ఎలా స్వేచ్ఛగా పనిచేస్తారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని ఆయన నియామక ఉత్తర్వులు ఇచ్చిన సీఎంఓ అధికారులకు తట్టకపోవడంపై అప్పుడే విమర్శలు వినిపించిన విషయం తెలిసిందే.



అందుకు తాజాగా తెరపైకి వచ్చిన జీవీ రెడ్డి ఉదంతాన్ని పార్టీ వర్గాలు పోల్చి చెబుతున్నాయి. ఫైబర్‌నెట్‌లో జరుగుతున్న అక్రమాలు, గత జగన్ హయాంలో అడ్డగోలుగా నియమించిన వారిని సాగనంపకుండా, ఎండి దినేష్ కుమార్ వ్యవహరిస్తున్న తీరును

మిగతా.. 2లో



# జీవితానికి 'స్కిల్ బి' దన్ను!

- నర్సింగ్ స్టూడెంట్స్‌కు జర్మన్ భాషలో శిక్షణ
- ఏటా వెయ్యిమంది నర్సింగ్ విద్యార్థులకు విదేశంలో ఉద్యోగాలు
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఆ సంస్థతో అవగాహన ఒప్పందం

**అమరావతి, మహానాడు:** రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో బిఎస్సీ నర్సింగ్, జిఎన్ఎం, ఎఎన్ఎం విద్యనభ్యసించే విద్యార్థినులకు జర్మనీ, ఐరోపా దేశాల్లో ఉద్యోగావకాశాలు లభించేలా శిక్షణ ఇప్పించేందుకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్కిల్ బి నడుమ అవగాహన ఒప్పందం కుదిరింది. రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఇరుపక్షాలు ఎంఓయుపై గురువారం సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... జర్మనీలో వృద్ధుల సంరక్షణ, హాస్పటల్స్ లో మూడు లక్షలమంది నర్సింగ్ అభ్యర్థుల కొరత ఉందని తెలిపారు. యూరప్‌లో ముఖ్యంగా జర్మనీలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రాష్ట్రంలో నర్సింగ్ విద్యనభ్యసించిన విద్యార్థినులకు స్కిల్ బి ద్వారా జర్మన్ భాషలో

మిగతా.. 4లో



07

హెచ్‌సియులో కూలిన బిల్డింగ్ ఎక్స్టెన్షన్



08

టన్నెల్లో చిక్కుకున్న వారు చనిపోయారు



03

రాష్ట్ర సచివాలయం నుంచి గురుకులాలపై నిరంతర పర్యవేక్షణ




## ఉగాదికి పట్టాలెక్కుతున్న

# పీ4 విధానం

- పేదల సాధికారతే లక్ష్యంగా వినూత్న కార్యక్రమం
- అట్టడుగు ప్రజలకు సంపన్న కుటుంబాల తోడ్పాటే పీ4
- పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాలకు అదనంగా సాధికారత కోసం సాయం
- ఆగస్టు కల్లా 5 లక్షల కుటుంబాల ధృవీకరణ పూర్తి
- ముందుగా నాలుగు గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు
- అధికారులతో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి:** అట్టడుగున ఉన్న పేదల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న పీ4 కార్యక్రమానికి ఉగాది నుంచి శ్రీకారం చుడుతోంది. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పీ4 విధానాన్ని ప్రవేశ పెడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం వివిధ వర్గాలకు అందిస్తున్న పథకాలకు అదనంగా ఈ కార్యక్రమం ద్వారా అట్టడుగున ఉన్న వారికి మరింత చేయూతను ఇచ్చే ప్రయత్నం చేస్తోంది. దీనికి సంబంధించి 'పీ4, ఫ్యామిలీ ఎంపవర్‌మెంట్ - బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్'పైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం ఉండవల్లి

మిగతా.. 4లో



## ఇక లోక్‌సభ సీట్లు 848?

- యూపీ-బీహార్ వాటాయే 222 సీట్లు
- దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు 165
- ఇతర రాష్ట్రాల్లో సీట్లు 461
- దక్షిణాది ఇక దణ్ణం పెట్టాల్సిందేనా?
- జనాభా కాదు ఆదాయ ప్రాతిపదికన విభజించాలని డిమాండ్
- ఆ లెక్కన దక్షిణాదికే పెరగాల్సిన సీట్లు
- అయినా నోరు విప్పని కూటమి పార్టీలు

7లో

# తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు

- ఉద్యోగ కల్పనలో నెంబర్ వన్‌గా నిలిచాం
- తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల జీడీపీ రాష్ట్రంగా మారుస్తా
- హెచ్‌సీఎల్ టెక్ కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహానాడు:** హైదరాబాద్‌లో హెచ్ సీఎల్ కేఆర్‌సీ క్యాంపస్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉంది. ప్రతిరోజూ మేం బహుళజాతి సంస్థలతో కొత్త అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడమో.. పెద్ద సంస్థలు తెలంగాణకు రావడమో.. గత సంవత్సరం సంతకం చేసిన ఎంఒయుల కొత్త సౌకర్యాలను ప్రారంభించడమో జరుగుతోంది. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.

కేవలం ఏడాది కాలంలోనే తెలంగాణకు దేశవిదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు వచ్చాయని గర్వంగా చెబుతున్నా. ఉద్యోగ కల్పనలో నెంబర్ వన్‌గా నిలిచాం. మన దగ్గర అత్యధిక ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్, అత్యల్ప ద్రవ్యోల్బణం ఉన్నాయి. తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల జీడీపీ రాష్ట్రంగా మారుస్తానని నేను ముందు చెప్పినప్పుడు.. అది సాధ్యం కాదని




కొందరు అన్నారు. రెండుసార్లు దావోస్ పర్యటనల్లో రూ.41,000 కోట్లు, రూ.1.78 లక్షల కోట్ల ఎంవోయూలపై సంతకాలు చేసుకున్న తరువాత ఇప్పుడు అది సాధ్యమని నమ్ముతున్నారు. మా పోటీ ముంబై, ఢిల్లీ, బెంగళూరు లేదా చెన్నైతో కాదని నేను చెప్పినప్పుడు, కొంతమంది అది పెద్ద కలనే అవుతుందన్నారు. మనం ఈవీ అడాప్షన్‌లో హైదరాబాద్ ను నంబర్ వన్‌గా చేశాక రాష్ట్రాన్ని డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, స్కిల్స్,

మిగతా.. 4లో



05

'ఛావా'... కాషాయ కాంతితో..



07

మమ్మల్ని అడిగి హామీలు ఇచ్చారా?



03

ప్రధాని మోదీ డైరెక్షన్‌లో సీఎం రేవంత్ రెడ్డి

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, ఫిబ్రవరి 2025 ||

## ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే చివరకు ఇలాగే ఉంటుంది

- చట్టబద్ధంగానే పోసానిని పోలీసులు అరెస్ట్ చేశారు
- మంత్రి కొల్లు రవీంద్ర



**అమరావతి:** చట్టబద్ధంగానే పోసానిని పోలీసులు అరెస్ట్ చేశారని, పోసాని మాట్లాడిన తీరును రాష్ట్ర ప్రజలు ఎవరూ మర్చిపోరని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే చివరకు ఇలాగే ఉంటుందని, ఇంట్లో ఉన్న ఆడబిడ్డల గురించి అసహ్యంగా, నీచంగా మాట్లాడాడని, ఆడబిడ్డలపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసే ఏ ఒక్కరినీ కూటమి ప్రభుత్వం వదలదని కొల్లు హెచ్చరించారు.

రెడ్ బుక్ రాజ్యాంగాన్నే అమలు చేయాలనుకుంటే ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే అందరినీ లోపలకు పంపించేవాళ్లమని చెప్పారు. వైసీపీ నేతలు చేసిన పాపాలే వాళ్లను వెంటాడుతున్నాయి.

తమ ప్రభుత్వ హయాంలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, మాజీ మంత్రి పేర్ని నాని ఫ్రస్టేషన్ లో ఉన్నారని, ఆయన భార్య జయసుధ అకౌంట్ లోకి డబ్బులు ఎలా జమ అయ్యాయో త్వరలోనే బయటకు వస్తాయని చెప్పారు. కాకినాడ షిప్పుల్లో బియ్యం అక్రమంగా ఎలా రవాణా అయిందో వివరాలన్నీ ఉన్నాయని కొల్లు రవీంద్ర తెలిపారు.

# అందుకే ఏబీ ఆ పదవి తీసుకోలేదా?

**మొదటి పేజీ తరువాయి..**

ఫైబర్‌నెట్ చైర్మన్ ఎండగట్టారు. అంతకుముందు ఆయన తన వాదనను ఎండిగా చెప్పినా వినిపించుకోకపోవడంతో విసిగివేసారిన జీవీ రెడ్డి.. ప్రెస్‌మీట్ పెట్టి మరీ, దినేష్ రాజద్రోహానికి పాల్పడుతున్నారంటూ ధ్వజమెత్తారు. దానితో సీఎం చంద్రబాబు ఆయనకు ఫోన్ చేసి తీవ్రంగా మందలించినట్లు ప్రచారం జరిగింది.

వివరణ ఇచ్చుకునేందుకు వెళ్లిన జీవీపై బాబు సీరియస్ అయి, ఇద్దరూ కలసి పనిచేసుకోండని హెచ్చరించి పంపించేశారు. తాను ఎవరిపైనయితే ఆరోపణలు చేశానో.. అదే అధికారితో కలసిపనిచేయటం కుదరని పని అని భావించిన జీవీరెడ్డి తన పదవికి, పార్టీ సభ్యత్వానికీ రాజీనామా చేయడం టీడీపీలో భూకంపం సృష్టించిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్-లక్ష్మీపార్వతి ఎపిసోడ్ తర్వాత.. ఆ స్థాయిలో రియాక్షన్ వచ్చిన తొలి సంఘటన ఇదేనని, పార్టీ వర్గాలు బహిరంగంగానే చర్చించుకుంటున్నాయి. రెడ్డి వర్గానికి చెందిన జీవీ రెడ్డి రాజీనామాపై, ఎలాంటి స్వప్రయోజనాలు ఆశించకుండా పార్టీని అభిమానించే కమ్మ వర్గాలు సైతం స్పందించి, జీవీకి దన్నుగా నిలిచిన వైనం ఆశ్చర్యపరిచిందని సీనియర్లు వ్యాఖ్యానిస్తున్నారు.

టీడీపీపై కమ్మ పార్టీ ముద్ర ఉన్నప్పటికీ, ఒక రెడ్డి నేత చేసిన రాజీనామాను కమ్మ వర్గమే జీర్ణించుకోలేకపోయింద ంటే, ఎక్కడ తప్పు జరిగిందో తెలుసుకుని దిద్దుబాటకు దిగాలన్న సూచన టీడీపీ సోషల్‌మీడియా సైనికుల నుంచి వె ల్లువెత్తుతోంది. అంటే కాంగ్రెస్ నుంచి వచ్చినప్పటికీ, జీవీరెడ్డి టీడీపీ శ్రేణులపై ఎంత బలమైన ముద్ర వేశారో స్పష్టమవుతోందని ఓ మాజీ మంత్రి విశ్లేషించారు. నిజానికి జీవీ రెడ్డి ఎపిసోడ్‌లో.. ప్రభుత్వ తీరును తప్పుపడుతోంది టీడీపీ సోషల్‌మీడియా సైనికులే కావడం ఆశ్చర్యం.

ఇలాంటి పరిణామాలు జరుగుతాయని ముందే ఊహించిన ఏబీ.. ఆ కారణంతోనే, తనకు ఇచ్చిన చైర్మన్ పదవి తీసుకోలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అంత్య నిష్టూరం కంటే ఆది నిష్టూరమే మంచిదన్న భావనతోనే ఆయన ఆ పదవి తీసుకోకుండా హైదరాబాద్ వెళ్లిపోయారంటున్నారు. అంటే తనకు చైర్మన్ పదవి ఇచ్చినా, ఎండి ఉన్నందున స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండదని ఏబీ ముందుగానే గ్రహించి, రాజీనామా చేశారంటున్నారు. అయినా ఏబీకి ఆ పదవికి సిఫార్సు చేసిన సీఎంఓ కీలక అధికారికి మెదడు లేకుండా, డీజీగా చేసిన వ్యక్తికి నామమాత్రపు చైర్మన్ పదవి ఒక్కటే ఎలా ఇస్తారన్న చర్చ అప్పుడే జరిగింది.

ప్రస్తుతం సీఎంఓలో ఉన్న ఏ ఒక్క అధికారి జగన్ ప్రభుత్వ బాధితుడు కాదని, అందువల్లనే వారి ఎంపికలు ఇలా తగలబడతున్నాయని టీడీపీ సీనియర్లు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. చంద్రబాబు ఎప్పటిలా పార్టీని పట్టించుకోకుండా, మునుపటి మాదిరిగా సీనియర్ల అభిప్రాయం తెలుసుకోకుండా, ప్రభుత్వంపై దృష్టి సారిస్తున్నందుకే ఇలాంటి ఫలితాలు ఎదురవుతున్నాయన్న అభిప్రాయం పొలిట్‌బ్యూరో సభ్యుల్లో వ్యక్తమవుతోంది.

అన్నీ చంద్రబాబు ఒక్కరే చూసుకోవడం కష్టమని, దానిని సీఎంఓ అధికారులు తమకు అనుకూలంగా మలచుకుంటున్నారన్న వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో బహిరంగంగానే వినిపిస్తున్నాయి. అధికారుల పెత్తనానికి తెరదించాలన్న సందేశం జీవీ రెడ్డి ఎపిసోడ్‌లో స్పష్టంగా కనిపించిందని ఓ సీనియర్ ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం గమనార్హం.

"బాధితులకే బాధితుల బాధలు, అవమానాలు అర్ధమవుతాయి. ఇప్పుడు సీఎంఓలో ఉన్న ఏ ఒక్క అధికారి జగన్ హయాంలో ఇబ్బందులు పడలేదు. అన్నీ కీలకమైన పోస్టింగుల్లోనే పనిచేశారు. ఓ అధికారి భార్య అయితే ఏకంగా వైసీపీకి సేవ చేశారు. ఇంకో అధికారి కూడా కీలకమైన పోస్టుల్లోనే చేశారు. వైసీపీకి విశేష సేవలందించిన మరో సీనియర్ అధికారికి, రాష్ట్రంలోనే అత్యంత కీలక పదవి ఇచ్చారు. మరి మనది పొలిటికల్ గవర్నరెన్స్ అని మనం ప్రచారం చేసుకుంటే కార్యకర్తలు, నాయకులు ఎలా నమ్ముతారు? నమ్మాల్సింది వాళ్లే కదా? అని ఓ మాజీ మంత్రి వ్యాఖ్యానించారు.

ఏబీ వెంకటేశ్వరరావుకు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా జీవో ఇచ్చి ఇన్ని రోజులయినా ఆయన ఆ పదవి తీసుకోలేని కారణాలను ఇప్పటివరకూ ఏ ఒక్క ప్రభుత్వ-పార్టీప్రముఖుడూ పిలిచి తెలుసుకోక పోవడంపై పార్టీ సీనియర్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీన్నిబట్టి ప్రభుత్వం-పార్టీ ఎటుపోతుంది? అజమాయిషీ చేస్తున్న వారి అనుభవం ఎంతన్నది క్యాడర్‌కు తెలిసిపోతుందని ఓ మాజీ మంత్రి వ్యాఖ్యానించారు.

అసంతృప్తితో ఉన్న నేతలను పిలిచి మాట్లాడే సంస్కృతి ఎన్టీఆర్ కాలం నుంచి, గత ఎనిమిది నెలల క్రితం వరకూ ఉండేదని, ఇప్పుడు దానికి తెరదించేశారన్న వ్యాఖ్యలు సీనియర్లలో వినిపిస్తున్నాయి. ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో చింతకాయల అయ్యన్నపాత్రుడు అసంతృప్తితో రాజీనామా చేసి, అజ్ఞాతవాసంలోకి వెళితే, ఆయనను అన్నగారు పిలిచి మాట్లాడిన సందర్భాన్ని ఆ మాజీ మంత్రి గుర్తు చేశారు.

" పాత్రుడు ఎవరికీ అందుబాటులోకి లేకుండా వెళితే అన్నగారు విశాఖ నేతలను పురమాయించి పాత్రుడిని పిలిపించుకున్నారు. ఒక తండ్రిగా, పార్టీ పెద్దగా నేను నిర్ణయం తీసుకోకూడదా? అని బుజ్జగించడంతో, పాత్రుడు తన రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. అలాగే బాబు గారు కూడా ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్నప్పుడు, అధికారంలో లేనప్పుడు ఎంతోమంది సీనియర్లను పిలిచి మాట్లాడితే వెనక్కి తగ్గారు. సీనియర్లను పంపించి బుజ్జగింపచేసేవాళ్లు. అసలు ఇప్పుడు అలాంటి వ్యవస్థ ఏదీ? ఇతర పార్టీల నుంచి వచ్చిన వారితో పనిచేయించుకుందాం. ఉండేవాళ్లు ఉంటారు. పోయేవాళ్లు పోతారన్న భావనతో ఉన్నట్లు కనిపిస్తోంది. పార్టీలో మాలాంటి సీనియర్ల నుంచి, జూనియర్ల వరకూ ఇలాంటి భావనే కనిపిస్తోందని" టీడీపీలో సుదీర్ఘ కాలం నుంచి పనిచేస్తున్న ఆ సీనియర్ నేత ఆవేదన వ్యక్తం చేశారు.



జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, ఫిబ్రవరి 2025

# రేవంత్.. 'చీఫ్' మినిస్టర్‌గా మాట్లాడవద్దు



- రేవంత్ రెడ్డి ధన దాహం వల్లనే ప్రమాదంలో 8 మంది కార్మికులు
- పరిపాలనను పక్కనపెట్టి టైంపాస్
- కార్మికులను రక్షించాల్సింది పోయి బ్లేమ్ గేమ్
- రేవంత్ రెడ్డికి ఆర్థిక వ్యవస్థ గురించి అవగాహన లేదు
- ఢిల్లీలో రేవంత్ రెడ్డి చిట్ చాట్ పేరిట చేసిన చిల్లర వ్యాఖ్యలపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కౌంటర్
- ఎస్ఎల్బిసి టన్నెల్ ప్రమాదంపైన రేవంత్ రెడ్డి చేసిన అడ్డగోలు వ్యాఖ్యల పైన మండిపడిన కేటీఆర్

హైదరాబాద్, మహానాడు: తన అసమర్థతను పాలనా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ రెడ్డి గత ప్రభుత్వం పైన నెపం నెడుతున్నారు. ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు ఉన్నది రేవంత్ రెడ్డి వ్యవహారం. జి ఎస్ ఐ, ఇంజనీరింగ్ నిపుణులు వంటి సంస్థలతో సంప్రదించకుండానే ఆగిపోయిన ప్రాజెక్టుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా, అవినీతి సొమ్ముల కోసం లాలూచీ పడి పాత యంత్రాలతో ప్రారంభించారు.

కేవలం రేవంత్ రెడ్డి ధన దాహం వల్లనే ఈరోజు 8 మంది కార్మికులు ప్రమాదంలో చిక్కుకున్నారు. వారు బతికున్నారో లేదో అనే ఆందోళనకరమైన పరిస్థితి నెలకొని ఉంది దీనికి పూర్తి బాధ్యత రేవంత్ రెడ్డిదే. రేవంత్ రెడ్డి కార్మికులను రక్షించాల్సింది పోయి బ్లేమ్ గేమ్ ప్రారంభించారు. దేవుడిచ్చిన ముఖ్యమంత్రి అవకాశాన్ని వాడుకొని ప్రజలకు మంచి చేయాల్సింది పోయి రాజకీయాలకు పాల్పడుతున్నారు.

ముఖ్యమంత్రిగా అవకాశం వచ్చింది కాబట్టి తెలంగాణకు మంచి జరిగేలా ప్రజలకు మంచి జరిగేలా వ్యవహరించాలని సూచిస్తున్నాను. ఛీఫ్ మినిస్టర్ గా మాట్లాడాలి కానీ ఒక చీప్ మినిస్టర్ గా మాట్లాడవద్దని రేవంత్ రెడ్డికి సూచిస్తున్నాను. రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాకనే రాష్ట్రంలో జరుగుతున్న మరణాలపైన ఇతరుల పేరును ప్రస్తావిస్తున్నారు. అధికారంలో తామే ఉన్నామన్నది మరిచిపోయి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు.

రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కావాల్సిన విచారణలు దర్యాప్తులు చేసుకోవచ్చు. కానీ కేవలం టైంపాస్ చేసేందుకు పరిపాలనను పక్కనపెట్టి చేతకాకనే ఇవన్నీ మాట్లాడుతున్నారు. అరచేతిలో స్వర్గం చూపించేలా ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాకనే ప్రజల టెన్షన్ డైవర్షన్ కోసం ముఖ్యమంత్రి ఇవన్నీ మాట్లాడుతున్నారు. 15 నెలల నుంచి కేవలం ప్రజల అటెన్షన్ డైవర్షన్ పేరుతో ఆటలాడుతున్న రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టారు

రేవంత్ రెడ్డి అన్ని విషయాల్లో అబద్ధాలు ఆడుతున్నారు. రాష్ట్ర అప్పుల విషయంలో కూడా అబద్ధాలు ఆడుతున్నారు. 6500 కోట్లు కేవలం వడ్డీ లెక్క అయిపోతుందంటూ రాష్ట్ర ప్రజలను, దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. రేవంత్ రెడ్డికి ఆర్థిక వ్యవస్థ గురించి అవగాహన లేదు.



## రాష్ట్ర సచివాలయం నుంచి

# గురుకులాలపై నిరంతర పర్యవేక్షణ

- బీసీ బిడ్డలకు నాణ్యమైన విద్య, భద్రత కల్పనే సీఎంచంద్రబాబు లక్ష్యం
- మరుగుదొడ్లు, బాత్ రూమ్‌లు, మెనూపై రోజు ఫొటోలు పంపాల్సిందే
- స్టడీ అవర్ల నిర్వహణపైనా క్లిక్ మనిపించాల్సిందే
- మంత్రి సవిత ఆధ్వర్యంలో ఫొటోల పరిశీలన
- ప్రభుత్వ అప్రమత్తతతో ఎంజేపీ స్కూళ్లో అత్యుత్తమ ఫలితాలు
- ఏటా గురుకులాల సీట్లకు పెరుగుతున్న డిమాండ్



అమరావతి: బీసీ బిడ్డల చదువుపై సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మహాత్మా బాపూజీ గురుకుల విద్యాలయాలపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోంది. నాణ్యమైన విద్య అందించడమే కాకుండా ఆహార, వసతి భద్రత కల్పించేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. వెనుకబడిన తరగతులను అన్ని రంగాలతో పాటు విద్యలోనూ ముందుకు తీసుకురావాలన్న లక్ష్యంతో అన్న ఎన్టీఆర్ బీసీ హాస్టళ్లకు, గురుకులాలకు శ్రీకారం చుట్టారు.

పేదరికంతో బీసీ బిడ్డలు విద్యకు దూరం కాకుడదన్న సదుద్దేశంతో ఎన్టీఆర్ హాస్టళ్లను, గురుకులాలను ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు సైతం బీసీ విద్యార్థుల చదువులపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 108 ఎంజేపీ స్కూళ్లు ఉండగా, వాటిలో 106 టీడీపీ ప్రభుత్వాలే మంజూరు చేశాయి. బీసీ విద్యార్థుల విద్యోన్నతికి టీడీపీ ప్రభుత్వాలు ఎంతటి ప్రాధాన్య మిస్తున్నాయో ఇట్టే అర్థమవుతుంది. కేవలం గురుకులాల స్థాపనతోనే సరిపెట్టకుండా నాణ్యమైన విద్య, భోజన, వసతితో పాటు నిరంతరం విద్యుత్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకుంది.

విద్యార్థులకు భద్రతకు భరోసా కల్పించేలా సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం గురుకులాల్లో సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేయిస్తోంది. పరిశుభ్రమైన తాగునీటిని అందించడానికి ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. దీంట్లో భాగంగా ఇప్పటికే పలు గురుకుల పాఠశాలలో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో స్టడీ అవర్లు నిర్వహిస్తోంది. రాష్ట్రంలో వ్యాప్తంగా ఉన్న అన్ని గురుకుల పాఠశాలల్లోనూ కంప్యూటర్ ల్యాబ్ లు ఏర్పాటు చేస్తోంది.

తొలి విడతగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 25 గురుకులాల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. త్వరలో మిగిలిన పాఠశాలల్లోనూ ల్యాబ్‌లు ఏర్పాటు చేయబోతున్నారు. ఇందుకోసం కోట్లాది రూపాయలను ప్రభుత్వం వెచ్చిస్తోంది. బీసీ విద్యార్థులకు వెచ్చించే ప్రతి రూపాయీ సద్వి నియోగం కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గురుకులాలపై నిరంతర పర్యవేక్షణ చేయిస్తోంది.

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో గురుకుల కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్ర సచివాలయం నుంచి పర్యవేక్షణ చేస్తున్నారు. గురుకులా నిర్వహణపై ప్రతి ఎంజేపీ స్కూల్ నుంచి ఏ రోజుకారోజు వాట్సాప్ ద్వారా ఫొటోలు తెప్పించుకుంటున్నారు. ఫొటోలు పరిశీలిస్తూ.. నిబంధనలు అతిక్రమిస్తే వెంటనే సరిదిద్దేలా సూచనలు చేస్తున్నారు. నిరంతరం పకడ్బందీ పర్యవేక్షణతో ఎంజేపీ స్కూళ్ల నిర్వహణపై ప్రశంసలు వెల్లువెత్తున్నాయి.

### రోజు ఫొటోలు పంపాల్సిందే...

బీసీ విద్యార్థుల భద్రతకు చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తోంది. దీనిలో భాగంగా గురుకులా నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఒకవైపు జిల్లా అధికారులు తరుచూ విజిట్ చేస్తున్నా... స్వయంగా గురుకుల సిబ్బందే బాధ్యత వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మరుగుదొడ్లు, బాత్రూమ్ లు, పరిసరాల శుభ్రత, మెనూ అమలు, ఆహార్యం నాణ్యత, స్టడీ అవర్ల నిర్వహణ ఇలా అన్నింటిపైనా వాట్సాప్ ద్వారా ఫొటోలను నేరుగా గురుకుల కార్యదర్శికి పంపేలా ఆదేశాలు జారీచేసింది.

ప్రతి రోజూ శుభ్రపరిచిన మరుగుదొడ్లు, బాత్ రూమ్ ల ఫొటోలను గురుకులాల వార్డెన్లు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. మెనూ ప్రకారం ఆహారం తయారు చేసి, సిబ్బంది వాటిని రుచి చూసిన తరవాత విద్యార్థులకు అందిస్తారు. ఈ ఫొటో కూడా పంపాల్సి ఉంటుంది. స్టడీ అవర్ల నిర్వహణతో విశ్రాంతి గదుల శుభ్రతపైనా కూడా ఫొటోలు అప్ లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ ఫొటోలను మంత్రి సవిత, గురుకుల కార్యదర్శి మాధవీలత ఎప్పకప్పుడు పరిశీలిస్తూ, తగిన సలహాలు సూచనలు అందజేస్తుంటారు.


### గురుకుల సీట్లకు విపరీతమైన డిమాండ్

కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా బీసీ బిడ్డలకు ఎంజేపీ స్కూళ్ల ద్వారా సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వం నాణ్యమైన విద్యనం దిస్తోంది. నిష్ణాతులైన ఉపాధ్యాయుల బోధనతో ప్రతి ఏటా టెన్త్, ఇంటర్, డిగ్రీలోఎంజేపీ స్కూళ్లు అత్యుత్తమ ఫలితాలు రాబడుతున్నాయి. ముఖ్యంగా టెన్త్‌లో ఏటా వంద శాతం మేర ఫలితాలు వస్తున్నాయి. ఎంజేపీ విద్యార్థులు విద్యలో రాణిస్తూనే క్రీడల్లోనూ నైపుణ్యం ప్రదర్శి స్తున్నారు. ఎందరో విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో సత్తా చాటుతున్నారు.

దీంతో ఎంజేపీ స్కూళ్లలో తమ పిల్లలను చేర్చడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ప్రతి ఏటా ఎంజేపీ స్కూళ్లలో ప్రవేశాలకు నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్ ల్లో వేలాది మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. రాబోయే విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న గురుకులాల ప్రవేశ పరీక్షలకు అత్యధిక మంది విద్యార్థులు హాజరవుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వస్తున్న డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నూతన ఎంజేపీ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. గడిచిన ఎనిమిది నెలల కాలంలో పెనుకొండలోని రాంపురంలోనూ, నెల్లూరు జిల్లా ఆత్మకూరులోనూ నూతన గురుకులాల స్కూళ్లను చంద్రబాబు ప్రభుత్వం ప్రారంభించింది.

# సెల్‌లో నాకు తోడు కావాలి.. ప్లీజ్!

- ఒంటరిగా ఉండలేనని జడ్జికి వల్లభనేని వంశీ అభ్యర్థన
- సెల్‌లో నన్ను ఒంటరిగా ఉంచొద్దు
- కుదరదన్న జడ్జి



విజయవాడ: వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ 3 రోజుల పోలీసు కస్టడీ ముగియడంతో విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా వంశీ జైలులోని సెల్‌లో తనను ఒంటరిగా ఉంచారని న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. తనకు ఆస్తమా సమస్య ఉందని, ఆరోగ్య సమస్య వస్తే ఇబ్బందని తెలిపారు. తనతో పాటు సెల్‌లో మరొకరిని ఉంచాలని, భద్రతా పరంగా తనకు ఇబ్బంది లేదని కోర్టును కోరారు.

ఇప్పటికే వంశీకి దగ్గరలో అటెండర్ సౌకర్యం కల్పించారు కదా అని న్యాయమూర్తి అడిగారు. సెల్‌లో మరొకరిని ఉంచేందుకు ఇన్‌ఛార్జి జడ్జిగా తాను ఆదేశించలేనని న్యాయమూర్తి తెలిపారు. సెల్‌లో ఏమైనా జరిగితే అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని న్యాయమూర్తి వ్యాఖ్యానించినట్టు సమాచారం. సెల్ మార్పు కోసం శుక్రవారం రెగ్యులర్ కోర్టులో మెమో దాఖలు చేయాలని వంశీ తరఫు న్యాయవాదికి సూచించారు. సెల్ వద్ద వార్డెన్‌ను ఉంచాలని జైలు సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేశారు. వంశీ భద్రత దృష్ట్యా సెల్‌లో ఒంటరిగా ఉంచామని ప్రభుత్వ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఆరోగ్య పరిశీలనకు వార్డెన్‌ను ఏర్పాటు చేసేందుకు అభ్యంతరం లేదని తెలిపారు. అనంతరం విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

### కేసు తారుమారు చేయాలని చూశారు: ఏసీపీ దామోదర్

సత్యవర్ధన్‌ను బెదిరించి కేసు తారుమారు చేయాలని చూశారని విజయవాడ సెంట్రల్ ఏసీపీ దామోదర్ తెలిపారు. వంశీ, అతని అనుచరులు సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. "సీసీ కెమెరా ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు సేకరించాం. కోర్టు ఆదేశాలతో వంశీని 3 రోజులు ప్రశ్నించాం. కొన్నింటికి ఔనని.. మరి కొన్ని ప్రశ్నలకు జవాబివ్వలేదు.

కనిపించని ఫోన్ గురించి అడిగితే తెలియదన్నారు. ఈనెల 12న హైదరాబాద్ నుంచి వచ్చి జగన్‌ను కలిసినట్టు వంశీ అంగీకరించారు. మాకు ఇంకా పూర్తి సమాచారం రావాల్సి ఉంది. మరోసారి వంశీతో పాటు ఇతర నిందితులను కస్టడీకి కోరుతూ పిటిషన్ వేస్తాం" అని ఏసీపీ దామోదర్ తెలిపారు.

# కేటీఆర్.. దుబాయ్ మృతిపై మాట్లాడవేం?

- కేదార్ ఘటనపై విచారణ చేయాలని కేటీఆర్ ఎందుకు మాట్లాడడం లేదు?
- గాంధీ భవన్‌లో టిపిసిసి మీడియా & కమ్యూనికేషన్స్, ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి




హైదరాబాద్: కేటీఆర్ .. సినీ నిర్మాత దుబాయ్ లో చనిపోయినప్పుడు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నీ నమ్మిన బంటు అక్కడే ఉన్నాడట. ఉన్నాడా లేడా? ట్విట్టర్ లో ఏ అంశం అయిన స్పందించే కేటీఆర్.. దుబాయ్ లో చనిపోయిన సినీ నిర్మాత విషయం లో ఎందుకు మాట్లాడడం లేదు?

కేదార్ మీకు పరిచయమా కాదా? కేదార్ రాడిసన్ బ్లూ డ్రగ్స్ కేస్ లో a4గా ఉన్నారు. కేదార్ కు మీ బావమరిది రాజ్ పాకాలకు దగ్గరి సంబంధం ఉన్నట్లు గతంలో ప్రచారం జరిగింది. కేదార్ ఘటన పై విచారణ చేయాలని కేటీఆర్ ఎందుకు మాట్లాడడం లేదు? ఆ ఘటన లో మీకు మీ మనుషులకు ఎలాంటి ప్రమేయం లేకపోతే విచారణ చేయాలని ప్రభుత్వంను అడగాలి...

బీఆర్ఎస్వాళ్ళు చేసిన పాపాల మీద పోరాటం చేస్తున్న వారు వరుసగా చనిపోతున్నారు. రాజలింగ మూర్తి,సంజీవ్ రెడ్డి, కేదార్ ఇలా అన్ని కేసులలో బీఆర్ఎస్వాళ్ళు ఉన్నారు. రానున్న రోజుల్లో ఈ మరణానికి గల కారణాలు బయటకి వస్తాయి.

# ప్రధాని మోదీ డైరెక్షన్‌లో సీఎం రేవంత్ రెడ్డి

- రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారు
- బీజేపీ, కాంగ్రెస్ మధ్య దోస్తీ బట్టబయలైంది
- రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలు ముఖ్యమా? కాంట్రాక్టర్లు ముఖ్యమా ?
- అహంకారానికి, కుటుంబ పాలనకు కేరాఫ్ అడ్రస్ ఎనుముల రేవంత్ రెడ్డి
- రాజ్యాంగేతర శక్తులుగా రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు
- తిరుపతి రెడ్డికి కలెక్టర్ ఎందుకు ఎదురెళ్లి స్వాగతం చెబుతున్నారు?
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విలేకరుల సమావేశం

హైదరాబాద్: ప్రధాని మోదీ డైరెక్షన్ లో సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారు. రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ ముఖ్య మంత్రిగా వ్యవహరిస్తున్నారు ప్రతీ విషయంలో బీజేపీతో సీఎం రేవంత్ రెడ్డి కలిసి పనిచేస్తున్నారు. అహం కారానికి, కుటుంబ పాలనకు కేరాఫ్ అడ్రస్ ఎనుముల రేవంత్ రెడ్డి.

బీజేపీ నాయకులే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దగ్గరుండి కాపాడుతున్నారు. మేము వాస్తవాలు బయటపెట్టగానే బీజేపీ నాయకులు మమ్మల్నే విమర్శిస్తారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ మధ్య భాగస్వామ్యం ఉంది. బీజేపీ, కాంగ్రెస్ మధ్య దోస్తీ బట్టబయలైంది. ప్రధానిని కలిసిన తర్వాత కేసీఆర్, కేటీఆర్ పై కేసులు పెడతామని రేవంత్ రెడ్డి అంటున్నారు. లేనిపోని విషయాలు తెచ్చి మాకు అంటగడుతున్నారు.

కల్వకుంట్ల కుటుంబాన్ని, బీఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేయడమే తప్పా సీఎంకు ఇంకో ఆలోచన లేదు. కల్వకుంట్ల కుటుంబం అంటే కట్టుబాట్లతో కూడిన కుటుంబం. మేము ఎప్పుడూ ప్రొటొకాల్ ను ఉల్లంఘించలేదు. కానీ రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు రాజ్యాంగేత శక్తులుగా వ్యవహరిస్తున్నారు.




ప్రధానిని కలిసిన తర్వాత తన సోదరుడు తిరుపతి రెడ్డి తన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అని సీఎం చెప్పు కున్నారు. పార్టీ పరంగా ఇన్ చార్జి అయితే మాకు ఇబ్బంది లేదు. కానీ అధికారిక సమావేశాల్లో ఎందుకు పాల్గొంటున్నారు. తిరుపతి రెడ్డికి కలెక్టర్ ఎందుకు ఎదురెళ్లి స్వాగతం చెబుతున్నారు? రాజ్యాంగేతర శక్తులను ముఖ్యమంత్రి ప్రోత్సహిస్తున్నట్లు కదా మా కుటుంబంలో అధికారికంగా, రాజ్యాంగబద్ధంగా ఎన్నికల్లో ఎన్నికయ్యి ప్రజాసేవ చేస్తున్నాం.

ముఖ్యమంత్రి సోదరులు ఇష్టారీతినా వ్యవహరిస్తున్నారు. గుమ్మడి నర్సయ్య వంటి మహోన్నతమైన వ్యక్తిని గేటు బయట నిలబెట్టి రేవంత్ రెడ్డి అహంకారాన్ని ప్రదర్శించారు. తెలంగాణ ప్రజలకు రక్షణ కవచంగా ఉన్న కేసీఆర్ కుటుంబాన్ని, బీఆర్ఎస్ పార్టీని ఇబ్బంది పెట్టాలన్నది సీఎం దురాలోచన. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి తెలంగాణకు రక్షణకవచంగా ఉన్న బీఆర్ఎస్ పై కుట్రలు చేస్తున్నాయి.

న్యాయవాది సంజీవ రెడ్డి కోర్టులో వాదిస్తూ అందరి ముందే ఆరు నెలల క్రితమే గుండె పోటుతో మరణించారు. భూపాలపల్లిలో భూతగాదాల వల్లనే హత్య జరిగినట్లు జిల్లా ఎస్పీ చెప్పారు. దుబాయ్ లో ఒక వ్యక్తి నిద్రలోనే చనిపోయారని పత్రికల్లోనే వచ్చింది. రేవంత్ రెడ్డి అంతులేని అబద్ధాలు చెబుతున్నారు.

నెలకు రూ.6500 కోట్ల వడ్డీ కడుతున్నామని అబద్ధాలు చెబుతున్న సీఎం. కాగ్ నివేదిక ప్రకారం ఏ నెల కూడా 2600 కోట్లకు మించి వడ్డీ కట్టలేదు. మరి 6500 కోట్లు కడుతున్నామని సీఎం ఎందుకు అబద్ధాలు చెబుతున్నారు? అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కనీసం ఇప్పుడైనా నిజాలు చెప్పాలి. రాష్ట్ర ఆదాయంపై కూడా రేవంత్ రెడ్డి తప్పుడు లెక్కలు చెబుతున్నారు.

ప్రతీ నెల 18 వేల కోట్ల ఆదాయం వస్తున్నదని సీఎం చెబుతున్నారు. కానీ కాగ్ ప్రకారం 12 వేల కోట్లకు మించి ఈ ఏడాది ఆదాయం రాలేదు. మరి ఈ అబద్ధపు లెక్కలు ఎందుకు చెప్తున్నట్లు? ఎవరిని మభ్య పెట్టడానికి చెబుతున్నారు? ఆదాయం పడిపోవడానికి ప్రధాన కారణం హైడ్రా. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా 18 వేల కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ హైడ్రా విధ్వంసం వల్ల దాని ద్వారా ఆదాయం 5800 కోట్లకు పడిపోయింది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని సర్వనాశనం చేసే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.

ప్రధాన మంత్రిని కలిసిన ముఖ్యమంత్రి కొత్త విషయాలపై వినతులు ఇవ్వలేదు. బీఆర్ఎస్ హయాంలో ఎస్ఎల్బీసీ పనులే జరగలేదని సీఎం పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. కేసీఆర్ విశాల హృదయం తెలవాలంటే ఎస్ఎల్బీసీ విషయంలో అర్థమవుతుంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఈ ప్రాజెక్టుపై కేసీఆర్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు.

ఎస్ఎల్బీసీ టన్నెల్ విషయంలో అప్పటి ప్రతిపక్ష నేత జానా రెడ్డిని ముందుపెట్టి కాంట్రాక్టరుకు 100 కోట్లు అడ్వాన్స్ ఇచ్చారు కేసీఆర్. కరోనా తర్వాత కాంట్రాక్టరు పనులు చేపట్టలేమంటే మళ్లీ 100 కోట్లు ఇచ్చిన ఘనత కేసీఆర్ ది టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు 30 ఏళ్లలో ఈ ప్రాజెక్టుపై పెట్టిన ఖర్చు 3340 కోట్లు కానీ కేవలం 10 ఏళ్లలో కేసీఆర్ పెట్టిన ఖర్చు 3890 కోట్లు ఇంత ఖర్చు పెట్టి 11 కీమీ మేర టన్నెల్ తవ్వి చేస్తే ముఖ్యమంత్రి అబద్ధాలు చెబుతున్నారు

సొంత జిల్లాలో సొంత ఊరు పక్కన విపత్తు జరిగితే పట్టించుకోకుండా సీఎం ఢిల్లీ వెళ్లారు. 8 మంది ప్రాణాలు చిక్కుకుంటే ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. ఉత్తరాఖండ్‌లో టన్నెల్‌లో కార్మికులు చిక్కు కుంటే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వెళ్లి వాళ్ల ప్రాణాలతో బయటపడేవరకు అక్కడే ఉన్నారు. కానీ మన ముఖ్య మంత్రికి దేని మీదా సోయి లేదు. రాష్ట్రానికి సంబం ధించి పార్లమెంటులో ప్రధాని అడగరు. ఇక్కడ ముఖ్యమంత్రి అడగరు.

ప్రధానిని కలిసిన రేవంత్ రెడ్డి పాత వినతులను కొత్తగా ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీని కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే పరిస్థితి లేదు. ఐరన్ లెగ్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నాలుగు ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిపోతే ఇప్పటికీ అతీగతీ లేదు. ఖమ్మం జిల్లాలో పెద్దవాగు మీద మొత్తం ప్రాజెక్టు కొట్టుకుపోతే ప్రభుత్వం స్పందించలేదు. మెఘా కృష్ణా రెడ్డి కడుతున్న ప్రాజెక్టుల గురించి మాట్లావద్దన్నట్లుగా సీఎం వ్యవహరిస్తున్నారు.

సుంకిశాల ప్రాజెక్టు మీద ఒకరు ఆర్టీఐ వేస్తే దేశ భద్రతకు సంబంధించిన విషయం కాబట్టి జవాబు ఇవ్వమని ప్రభుత్వం చెప్పింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలు ముఖ్యమా? కాంట్రాక్టర్లు ముఖ్యమా ? ప్రధానిని కలిసిన వెంటనే బీఆర్ఎస్ పని ఖతమని సీఎం రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలికారు

మరి వీటన్నింటికి మా కుటుంబానికి, మా పార్టీకి సంబంధం ఏంటి ? ఇది కేసీఆర్ పై, బీఆర్ఎస్ పార్టీపై సీఎం కుట్ర పన్నడమే కానీ మరొకటి కాదు. సంబంధం లేని సంఘటనల గురించి ప్రధానిని కలిసిన తర్వాత సీఎం మాట్లాడారు దీన్ని బట్టే కుట్ర జరుగుతున్నట్లు అర్థమవుతున్నది.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 28, ఫిబ్రవరి 2025 ‖



# ఆలపాటి భారీ మెజార్టీతో గెలుస్తారు

- **గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఆలపాటికి భారీ పోలింగ్ నమోదు కావడానికి కృషి చేసిన పరిశీలకులు, ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ**




**గుంటూరు:** ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన పరిశీలకులు, ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, తూర్పు నియోజకవర్గానికి చెందిన అన్ని బూత్‌లను సందర్శించారు. అక్కడ ఉన్నటువంటి కార్పొరేటర్లు, క్లస్టర్ ఇంచార్జులు, బూత్ ఇంచార్జులు, యూనిట్ నాయకులతో ఎక్కువ మంది ఓటర్లను ఓటింగ్ చేసే విధంగా ప్రోత్సహించాలని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ, "ప్రతి ఒక్క ఓటర్ తన ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవడం చాలా ముఖ్యం. మన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి కి భారీ మెజార్టీ లభించాలంటే, ప్రతి ఒక్క ఓటర్ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించు కోవాలి" అని పిలుపునిచ్చారు. పరిశీలకుల బృందం అన్ని పోలింగ్ కేంద్రాలలో క్రమ శిక్షణతో కూడిన ఓటింగ్ ప్రక్రియ జరుగు తున్నట్లు నిర్ధారించుకున్నారు. "ఈ ఎన్నికలలో మన అభ్యర్థికి ఓటు వేయడం అంటే, మన ప్రాంత అభివృద్ధికి మద్దతు ఇవ్వడమే" అని బాలాజీ తెలిపారు. "ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుంటూ, అందరూ సామరస్యంతో ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు " అని ఆయన సూచించారు. ప్రతి బూత్‌లో ఉన్న కార్యకర్తలు ఓటర్లకు అవసరమైన సహాయం అందించి, వారి ఓటు హక్కు వినియోగించు కోవడానికి సహకరించా రని. గత ఎన్నికల కంటే ఈసారి భారీగా ఓటింగ్ నమోదు అయిందని, దానివల్ల ఆలపాటికి అధిక మెజారిటీ లభిస్తుందని ఆశాభావం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాయకులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ , మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దాసరి రాజా మాస్టర్, యువ నాయకులు బట్టు ప్రవీణ్ కుమార్, డిప్యూటీ మేయర్ సాజీల, కార్పొరేటర్ ఎలావుల అశోక్, కార్పొరేటర్ పోతురాజు సమత, తెలుగు మహిళా నాయకురాలు గుడివల్లు వాణి, మాజీ కార్పొరేటర్ గోళ్ళ ప్రభాకర్, పురుషోత్తమరావు బిజెపి నాయకులు , కిషోర్ కుమార్ జనసేన నాయకులు, దయా రత్నం ఎస్సీ సెల్ నాయకులు బాంక చిరంజీవి స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీవితానికి 'స్కిల్ బి' దన్ను!

మొదటి పేజీ తరువాయి..

నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు ఈ ఒప్పందం దోహదపడు తుందని తెలిపారు. ఈ శిక్షణ వల్ల ప్రతిఏటా వెయ్యిమంది నర్సింగ్ విద్యార్థినులకు జర్మనీలో అత్యుత్తమ ప్యాకేజితో ఉద్యోగాలు లభిస్తాయని



చెప్పారు. స్కిల్ బి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కో ఫౌండర్ వింజమూరి రవిచంద్రగౌతమ్, సీఈవో ఉజ్వల్ చౌహన్ మాట్లాడుతూ... తమ సంస్థ ఆధ్వర్యాన ఇప్పటివరకు 10 వేల మందికిపైగా విదేశాల్లో ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. స్కిల్ బి అంతర్జాతీయస్థాయి అత్యుత్తమ రిక్రూట్‌మెంట్ స్టార్టప్‌లలో ఒకటిగా ఉందని తెలిపారు. జర్మనీ, పోలాండ్, హంగేరీ, లిథువేనియా, లాట్వియా, ఇతర తూర్పు ఐరోపా దేశాలకు తమ సంస్థ ద్వారా అభ్యర్థులను రిక్రూట్ చేస్తున్నామని అన్నారు.

ఏపీఎస్ఎస్డీసీ భాగస్వామ్యంతో బిఎస్సీ నర్సింగ్, జిఎన్ఎం, ఎఎన్ఎం స్పెషలైజేషన్ తో గ్రాడ్యుయేషన్ పొందిన నర్సులకు జర్మన్ భాషలో ఉచిత శిక్షణ ఇచ్చి, ప్లేస్ మెంట్ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. స్కిల్‌బీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఏపీఎస్ఎస్డీసీలు భాషా నైపుణ్య కొరతను పరిష్కరించి, ఏపీని నైపుణ్య రాజధానిగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, విశాఖపట్నంలోని ప్రైవేటు నర్సింగ్ కళాశాలలు, ఉమ్మడి తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లోని నాలుగు వేల మందికి పైగా నర్సింగ్ విద్యార్థులకు స్కిల్ బి ద్వారా జర్మన్ భాషలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ అండ్ ట్రైనింగ్ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, ఏపీఎస్ఎస్డీసీ సీఈవో గణేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ మనోహర్, మెడిక్రూటర్ ఎండి రోనాల్డ్ రెస్కే పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల శిబిరాలను సందర్శించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**కాకినాడ, మహానాడు:** ప్రజాస్వామ్యంలో ఓటు విలువైన హక్కు అని ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలి అని జగ్గంపేట శాసన సభ్యుడు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలో 13, 14, 15 బూతులలో ఎమ్మెల్సీ ఎన్నికల శిబిరాలను సందర్శించిన ఎమ్మెల్యే, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఎన్డీఏ శ్రేణులతో కలిసి పోలింగ్ కేంద్రాలను సందర్శించి నాయకులకు దిశానిర్దేశం చేశారు. పోలింగ్ సరళి పై ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకుని, ఓటింగ్ శాతంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధిక శాతం ఓటింగ్ జరిగేలా చూడాలని పార్టీ శ్రేణులకు సూచనలు ఇచ్చారు. గురువారం ఉదయం నుంచి టిడిపి శ్రేణులను అప్రమత్తం చేసి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపు సునాయాసంగా దక్కేలా సూచనలు, సలహాలు, ఇచ్చారు.ఎన్నికల నియమావళిని గౌరవిస్తూ, ఎన్నికల సంఘం వారికి, పోలీసులకు సహకరించాలని శ్రేణులకు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, బుర్రి సత్తిబాబు, రేఖ బుల్లి రాజు, వేములకొండ జోగారావు,ముసిరెడ్డి నాగేశ్వరరావు, పీలా మహేష్ మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు నకిరెడ్డి సూర్యవతి అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఎబిడిఎంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఇద్దరు రాష్ట్ర వైద్యులకు కేంద్రం సత్కారం

**అమరావతి:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఎబిడిఎం)కార్యక్రమం అమలులో అత్యుత్తమ పనితీరు కనబర్చినందుకు గాను రాష్ట్రానికి చెందిన ఇద్దరు ప్రైవేట్ వైద్యుల్ని జాతీయ ఆరోగ్య అథారిటీ (NHA), న్యూఢిల్లీ జూమ్ కాన్ఫరెన్స్ లో సత్కరించిందని ఎబిడిఎం రాష్ట్ర నోడల్ ఆఫీసర్ బివి రావు గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎబిడిఎం అమలులో అత్యుత్తమ పనితీరు కనబర్చిన దేశంలోని 50 మంది ఆరోగ్య సంరక్షణ నిపుణులలో గుంటూరు లోని శ్రీ కృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ శ్రీనివాస్ మరియు గుంతకల్‌లోని సుమంత్ ఆర్థోపెడిక్ సెంటర్‌కు చెందిన డాక్టర్ శ్రీకాంత్ వున్నారని ఆయన తెలిపారు. వారు ఎబిడిఎంను ముందుగా స్వీకరించి అమలు చేయడంతో పాటు అభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) లింక్డ్ హెల్త్ రికార్డులను రూపొందించడంలో వారి గణనీయమైన కృషికి ఈ సత్కారం లభించిందని ఆయన వివరించారు. భారతదేశం యొక్క ఇంటిగ్రేటెడ్ డిజిటల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు అవసరమైన సహకారాన్ని అందించడం ఎబిడిఎం లక్ష్యం. అభా–లింక్డ్ హెల్త్ రికార్డ్‌లను రూపొందించడం ద్వారా, ఈ వైద్యులు రోగులకు వారి ఆరోగ్య సమాచారంపై నియంత్రణను ఇచ్చే డిజిటల్ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో సహాయపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో వైద్య నిపుణులు రోగి సమ్మతితో కచ్చితమైన వైద్య చరిత్రలను యాక్సెస్ చేయడానికి వీరు వీలు కల్పిస్తున్నారన్నారు.అభాలను రూపొందించినందుకు ప్రభుత్వ మరియు ప్రైవేట్ హెల్త్ కేర్ సౌకర్యాలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని రెండు ప్రైవేట్ హెల్త్ ఫెసిలిటీలకు కేంద్ర ప్రభుత్వ సత్కారం లభించడం విశేషం. నేషనల్ హెల్త్ అథారిటీ ఎండి, అదనపు సిఇఓ వాస్కా కిరణ్ గోపాల్ రెండు ఆసుపత్రుల వైద్య నిపుణులను జూమ్ కాన్ఫరెన్స్ లో సత్కరించారని బివిరావ్ పేర్కొన్నారు.





# శ్రీవారి లడ్డూ ప్రసాదం నెయ్యిలో కల్తీ నిజమే

**- ఏ5 అపూర్వ చావడా ఒప్పుకోలు?**

**తిరుపతి:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగింది వాస్తవమేనని ఏ5 అపూర్వ చావడా సిట్ విచారణలో తెలిపినట్లు సమాచారం. కెమికల్ ఇంజినీరింగ్ చదివిన తాను నెయ్యిలోరసాయనాలు కలిపానని విచారణ సందర్భంగా అంగీకరించినట్లు సమాచారం.

ఈ నేపథ్యంలోనే ఆ రసాయనాలను ఎక్కడి నుంచి సేకరించారని ఎంత మోతాదులో వినియోగించారని, ఇంకా ఇందులో ఎవరెవరి పాత్ర ఉందనే విషయాలపై తదుపరి దర్యాప్తు అవసరమని సిట్ భావించింది. అందు కోసం అపూర్వ చావడాను మరోసారి కస్టడీకి అప్పగిం చాలని కోరుతూ తిరుపతి రెండో అదనపు మున్సిఫ్ కోర్టులో సిట్ తరపున న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. ఆయనతోపాటు ఏ3 విపిన్ జైన్‌ను కూడా కస్టడీకి ఇవ్వాలని కోరారు. సిట్ తరఫున స్థానిక ఏపీపీ, విజయవాడలోని సీబీఐ కోర్టు ఏపీపీ వాదనలు వినిపిం చారు. మరోవైపు భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ డైరెక్టర్లు విపిన్ జైన్ (ఏ3), పొమిల్ జైన్ (ఏ4) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను వారి తరపు న్యాయవాదులు ఉప సంహరించుకున్నారని ఏపీపీ పి.జయశేఖర్ తెలిపారు.

కస్టడీ పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున బెయిల్ విజ్ఞప్తిని వెనక్కు తీసుకున్నామని న్యాయవాదులు తెలిపారు. దీంతో జడ్జి కోటేశ్వరరావు వారి పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అపూర్వ చావడా దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్, సిట్ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను వాదనల నిమిత్తం తదుపరి విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేశారు.

# తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు

మొదటి పేజీ తరువాయి..

మ్యాను ఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్‌కు హబ్‌గా మారుస్తున్నాం.

ఇప్పుడు హైదరాబాద్ రైజింగ్ ఆగదు అని ప్రజలు అంటున్నారు. నేను మొదట తెలంగాణ రైజింగ్ అని చెప్పినప్పుడు కొందరికి ఖచ్చితంగా తెలియదు. ఇప్పుడు ప్రపంచం మొత్తం అంగీకరిస్తోంది. నేను మొదట హైదరాబాద్ రైజింగ్ అని చెప్పినప్పుడు కొందరికి అనుమానం వచ్చింది. ఇప్పుడు ప్రపంచం మొత్తం అంగీకరిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ కంపెనీల్లో ఒకటైన ఆమ్జెన్‌ను కొద్దిరోజుల క్రితం ప్రారంభిం చుకున్నాం. మేం ప్రపంచంలోని అత్యుత్తమ సమావేశాలలో ఒకటైన బయో ఏషియాను నిర్వహించాం. ఇవాళ హెచ్‌సీఎల్‌లో ఉన్నాం. గ్లోబల్ కంపెనీగా హెచ్‌సీఎల్ టెక్ భారతదేశానికి గర్వకారణంగా నిలిచింది. ఇది 60 దేశాలలో ఆపరేట్ చేస్తోంది మరియు 2.2 లక్షల మందికి పైగా ఉద్యోగులను కలిగి ఉంది. డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో వరల్డ్ క్లాస్ ఆఫరింగ్స్ క్రియేట్ చేస్తున్నారు.

2007లో హైదరాబాద్ వచ్చినప్పటి నుంచి అంచెలంచెలుగా హెచ్ సీఎల్ పెద్ద స్థాయికి ఎదిగింది. ఇవాళ 3.2 లక్షల చదరపు అడుగుల




విస్తీర్ణంలో దాదాపు 5 వేల మందితో కేఆర్ సీలో ప్రపంచస్థాయి సదుపాయంతో హెచ్ సీఎల్ టెక్ హైదరాబాద్ లో గొప్ప పనులు చేస్తుంది.




## ఉగాదికి పట్టాలెక్కుతున్న

# పీ4 విధానం

మొదటి పేజీ తరువాయి..

నివాసంలో శాఖపరమైన సమావేశాన్ని నిర్వహించారు.

### పేదరికం లేని రాష్ట్రమే లక్ష్యం

సంపదలో పైవరుసలో ఉన్న కుటుంబాలు సమజంలో అట్టడుగున ఉన్న కుటుంబాలకు, మద్దతుగా నిలబడటమే పీ4 విధానం యొక్క ముఖ్య ఉద్దేశం కావాలని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. ఇందుకు నిర్మాణాత్మక, స్థిరమైన విధానం ఉండాల్సిన ఆవశ్యకతను ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### ఉగాది నాటికి అమల్లోకి పీ4 విధానం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన పీ4 విధానం ఈ ఉగాది నాటికి కార్యరూపం దాల్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొదటగా రాష్ట్రంలోని 4 గ్రామాల్లో పీ4 విధానాన్ని పైలెట్ ప్రాజెక్టుగా అధికారులు రూపొందించారు. ఈ పైలెట్ ప్రాజెక్టుతో 5,869 కుటుంబాలకు లబ్ధి పొందుతాయి.

### 'పీ4'లోకి ఆగస్ట్ కల్లా 5 లక్షల కుటుంబాలు

ఈ ఉగాదికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా అమల్లోకి రానున్న ఈ కార్యక్రమంలో ఈ ఏడాది ఆగస్టు నాటికి 5 లక్షల అభిలాషి కుటుంబాలను 'సమృద్ధి బంధనమ్' కింద తీసుకువచ్చేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ సహా సీనియర్ అధికారులు పీయూష్ కుమార్, కాటంనేని భాస్కర్, ప్లానింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### కుటుంబాల ధృవీకరణ

ఈ విధానం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హత ఉన్న కుటుంబాలను జీఎస్‌డబ్లుఎస్ డేటాబేస్, హౌస్‌హోల్డ్ సర్వే, గ్రామసభ ధృవీకరణ ద్వారా గుర్తించడం జరుగుతోంది. 2 ఎకరాల మాగాణి లేదా 5 ఎకరాలు మెట్ట భూమి ఉన్న భూ యజమానులను, ప్రభుత్వ ఉద్యోగులను, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నవారిని, ఫోర్ వీలర్ వెహికల్ ఉన్నవారిని, 200 యూనిట్లు కన్నా ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్న వారిని, మున్సిపల్ ఏరియాలో సొంత ఆస్తి ఉన్నవారిని, ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న కుటుంబాల వారిని ఈ కార్యక్రమం నుంచి మినహాయించారు. తద్వారా నిజంగా పేద రికంలో ఉన్నవారికి సాయం అందచేయవచ్చని ప్రభుత్వం భావి స్తోంది. దీంతో రాష్ట్రంలోని 40 లక్షల కుటుంబాలు పీ4కు అర్హులుగా ప్రాథమికంగా నిర్ధారించారు.

### కొనసాగుతున్న హౌస్ హెూల్డ్ సర్వే

హౌస్ హెూల్డ్ సర్వే మొదటి దశ కింద రాష్ట్రంలో 10 జిల్లాల్లో ఫిబ్రవరి 20 నుంచి సర్వే జరుగుతోంది. ఇది మార్చి 2కి పూర్తవుతుంది. ఈ పది జిల్లాల్లో 52 లక్షల కుటుంబాలు ఉంటే 27 లక్షల కుటుంబాల సర్వే పూర్తయ్యింది. రెండో దశ కింద రాష్ట్రంలో మిగిలిన 16 జిల్లాల్లో హౌస్ హెూల్డ్ సర్వే మార్చి 8 నుంచి మొదలుపెట్టి మార్చి 18 నాటికి పూర్తి చేస్తారు. ఈ 16 జిల్లాల్లో 76 లక్షల కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది. పేద కుటుంబాలకు ఇప్పటికే అందుతున్న వివిధ ప్రభుత్వ పథకాలకు అదనంగా వారి సాధికారత కోసం పి4 విధానం ద్వారా సాయం చేయనున్నారు. ఈ సర్వేలు అట్టడుగున ఉన్న వారిని గుర్తించడానికే తప్ప...వీటి ఆధారంగా ఇప్పటికే ప్రభుత్వ పథకాలు పొందుతున్న లబ్ధి దారుల్లో ఎటువంటి మార్పులు చేయరు.

### అనుసంధానమే 'సమృద్ధి బంధనమ్'

లబ్ధిదారుల ధృవీకరణ పూర్తి అయిన తర్వాత సమృద్ధి బంధనమ్ ప్లాట్‌ఫామ్‌లో ఆయా కుటుంబాల వివరాలు పొందుపరుస్తారు. లబ్ధి పొందాల్సిన కుటుంబాలతో సాయం చేసే కుటుంబాలను అనుసంధా నించడమే ప్రభుత్వ పాత్రగా ఉంటుంది. ఎక్కడా ప్రభుత్వం నేరుగా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించదు. మ్యాచింగ్, ఎనర్జింగ్, ట్రాకింగ్...వరకే ప్రభుత్వ పాత్ర ఉంటుంది. ఇందులో ఎటువంటి ఒత్తిడి ఉండదు.. స్వచ్ఛంధంగా ఆయా కుటుంబాలు, వ్యక్తులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావచ్చు.







గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఉండవల్లి పంచాయితీ ఆఫీసు సమీపంలోని ఎంపీయూపీ స్కూల్లో గురువారం ఓటు హక్కు వినియోగించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్.





జనం గుండె చప్పుడు

# మహానాడు

5

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, ఫిబ్రవరి 2025

# పోసాని అరెస్ట్‌ను ఖండించిన జగన్

- పోసాని సతీమణి కుసుమలతను ఫోన్ లో పరామర్శించిన వైయస్ జగన్
- పోసాని అరెస్ట్ విషయంలో అండగా ఉంటామని ధైర్యం చెప్పిన వైయస్ జగన్



**అమరావతి:**సి పోసాని కృష్ణమురళి అరెస్ట్ ను వైయస్ఆర్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ఖండించారు. అరెస్ట్ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఆయన భార్య పోసాని కుసుమలతను గురువారం ఫోన్‌లో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ పాలన నిరంకుశంగా సాగుతోందని, ఈ అరెస్ట్ విషయంలో పోసాని కృష్ణమురళికి వైయస్ఆర్సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జరుగుతున్న వ్యవహారాలను ప్రజలు, దేవుడు చూస్తున్నారని, కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలన్నారు. పార్టీ తరుఫున న్యాయ పరంగా సహాయం అందిస్తామని, ఇప్పటికే పార్టీకి సంబంధించిన సీనియర్ న్యాయవాదులకు ఈ వ్యవహారాన్ని అప్పగించామని తెలిపారు.



## ప్రభుత్వమే శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తోంది

- ఎన్నికల హామీల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలమైంది
- హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే కేసులు పెడుతోంది
- ప్రభుత్వ తీరుపై మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఫైర్

**రాజమండ్రి:** గడిచిన తొమ్మిది నెలల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికార కూటమి ప్రభుత్వం ఏదోరకంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యక్రమాలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు మీద అక్రమ కేసులు బనాయించడంతో పాటు అర్ధరాత్రి పూట ఇళ్లకు వెళ్లి మహిళలను సైతం బెదిరిస్తున్నారని మండిపడ్డారు.

ఆరోగ్యం బాగాలేదని చెప్పినా అవేవీ లెక్కచేయకుండా అధికారం ఉంది కదా ఏం చేసినా చెల్లుతుందన్న ధోరణిలో వైయస్సార్సీపీ తరపున గొంతు కలిపిన ప్రతి ఒక్కరినీ ఇబ్బంది పెడుతున్నారని ఆక్షేపించారు. గడిచిన నెల రోజుల్లో వల్లభనేని వంశీ, పోసాని కృష్ణ మురళీల అక్రమ అరెస్టుల ద్వారా కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతోందన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వేటినీ కూటమి ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందన్న రాజా... తల్లికి వందనం గాలికి వదిలేసిందని, సూపర్ సిక్స్ ను పూర్తిగా అటకెక్కించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వం తెరలేపిన ఈ కొత్త సంస్కృతి, సాంప్రదాయంతో.... రేపు మళ్లీ అదే బోనులో మీరు నిలబడాల్సి ఉంటుందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం చేసే ప్రతి అరాచకాన్ని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారన్న ఆయన... ప్రభుత్వం మీద ప్రజల్లో ఇంత తీవ్రమైన స్థాయిలో వ్యతిరేకత ఎప్పుడూ చూడలేదన్నారు. గద్దెనెక్కించిన ప్రజలే ప్రభుత్వాన్ని గద్దె దించే కార్యక్రమం చేస్తారని.. ప్రజలు తిరుగుబాటుకి సిద్ధంగా ఉన్నారని రాజా స్పష్టం చేశారు.

## పోసాని కృష్ణమురళికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు

- డాక్టర్ గురు మహేశ్



**ఓబులవారిపల్లె:** వైసీపీ నేత పోసాని కృష్ణమురళికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, పోలీసుల విచారణకు ఆరోగ్యపరంగా ఎలాంటి ఆటంకం లేదని డాక్టర్ గురు మహేష్ వెల్లడించారు. పోసానికి అన్నమయ్య జిల్లా ఓబుల వారిపల్లె పోలీస్ స్టేషన్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. పోసాని కృష్ణమురళిని కలిసేందుకు ఆయన తరఫు న్యాయవాది నాగిరెడ్డి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. పోలీసులు అనుమతించలేదు.

## ఏపీలో జాతీయ క్రీడాపోటీలు ప్రతిపాదనపై పీటీ ఉష మద్దతు

- సీఎం నివాసంలో ఉషను కలిసిన ఎంపి కేశినేని, శాప్ చైర్మన్ అనిమిని

**విజయవాడ, మహానాడు:**

2028-29లో జరగనున్న 40వ జాతీయస్థాయి క్రీడాపోటీలను ఏపీకి కేటాయించేందుకు కృషి చేస్తానని ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్, రాజ్యసభ ఎంపీ పీటీ ఉష ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి హామీ ఇచ్చారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. గురువారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో పీటీ ఉషను ఎంపి కేశినేని శివనాథ్, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీటీ ఉషతో ఏపీ క్రీడాభివృద్ధికి సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించటంతోపాటు, ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో దేశంలోనే అత్యుత్తమంగా రూపొందించిన ఏపీ స్పోర్ట్స్ పాలసీను వివరించారని ఎంపి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.



అలాగే 2028-29లో జరగనున్న 40వ జాతీయస్థాయి క్రీడాపోటీలను ఏపీకి కేటాయించాలని, జాతీయ పోటీల నిర్వహణకు అనుగుణంగా ఏపీలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో స్పోర్ట్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు వివరించారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2002లో నేషనల్ గేమ్స్, 2003లో ఎఫ్రో-ఏషియన్ గేమ్స్‌ను దిగ్విజయంగా నిర్వహించామని సంగతి సీఎం చంద్రబాబు ఉషకు వివరించారని తెలిపారు.

క్రీడాపోటీలను ఏపీలో నిర్వహించేందుకు ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ నుంచి సహాయసహకారాలు అవసరమని సీఎం ఆకాంక్షించినట్టు చెప్పారు. ఇందుకు ఉష బదులిస్తూ గతంలో హైదరాబాద్ వేదికగా జాతీయ, ఎఫ్రో-ఏషియన్ గేమ్స్‌ను సమర్థవంతంగా, దిగ్విజయంగా నిర్వహించిన సంగతి విదితమేనని, 40వ జాతీయ క్రీడాపోటీలను ఏపీకి కేటాయిస్తే నిర్వహించగలిగే సమర్థత, అనుభవం తమరికి ఉందని కొనియాడినట్టు తెలిపారు. ఈసారి ఏపీకి 40వ జాతీయక్రీడాపోటీలను కేటాయించేందుకు కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చినట్టు చెప్పారు..

ఈ కార్యక్రమంలో శాప్ ఎండీ పీఎస్.గిరీషా, ఉష భర్త వి.శ్రీనివాసన్, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ జాయింట్ సెక్రటరీ ఆకుల రాఘవేంద్ర పాల్గొన్నారు.

# శ్రీపాద శ్రీనివాస్ రచనా వ్యాసంగం కొనసాగించాలి

- ఆత్మీయ పూరిత వాతావరణంలో అంతరంగం సంకలనం ఆవిష్కరణ
- ఇప్పుడు చేసే రచనలు భవిష్యత్తులో చర్చకు వస్తాయి : ఉండవల్లి
- శ్రీపాద రచనలు ఆర్ధ్రత గుర్తుచేస్తాయి : మంత్రి దుర్గేష్
- శ్రీపాద శ్రీనివాస్ ధర్మాత్ముడు లాంటివాడు : డొక్కా మాణిక్య వరప్రసాద్
- అసెంబ్లీలో వేసిన ప్రశ్నలకు పుస్తక రూపం ఇచ్చి మళ్ళీ గుర్తింపు తెచ్చాడు :రౌతు
- అందరినీ చైతన్య పరిచే నిజాయితీ పరుడు శ్రీపాద శ్రీనివాస్ : డా వంశీకృష్ణ
- అమ్మ, గోదావరి, స్నేహబృందం, రాజకీయాలే కథావస్తువులని చింతపెంట ప్రభాకర్ విశ్లేషణ

**రాజమహేంద్రవరం:** అందరితో స్నేహతత్వం కొనసాగిస్తూ, సామాజిక స్పృహతో రచనలు చేస్తున్న శ్రీపాద శ్రీనివాస్ తన రచనా వ్యాసంగం కొనసాగించాలని పలువురు సూచించారు. ఆప్యాయత అనురాగాలు పంచుతూ అందరితో కలివిడిగా ఉండడం, అందరి శ్రేయస్సు, అభివృద్ధి కాంక్షించడం అభినందనీయమన్నారు. తాజాగా 'విభిన్న అంశాల సమాహారంగా 'అంతరంగం' పుస్తకాన్ని నాల్గవ సంకలనంగా స్వీయ రచనలు, రేడియో కార్యక్రమాలు వాటిపై అభిప్రాయ మాలికలు మేళవించి రూపొందించారు. హరిచందన పబ్లికేషన్స్ పక్షాన గజరావు వెంకటేశ్వరరావు సారథ్యంలో ఈ పుస్తకం రూపొందింది.

ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం ప్రకాశం నగర్ ధర్మంచర కమ్యూనిటీ హాలుపైన బుక్ బ్యాంకులో ఆత్మీయ పూరిత వాతావరణంలో నిర్వహించారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ కుమార్, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్ ఆవిష్కరించారు.

ఈసందర్బంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ సాంస్కృతిక నగరం రాజమండ్రిలో శ్రీపాద పుస్తకావిష్కరణ ఇంతమంది ఆత్మీయుల నడుమ సాగడం ఆనందంగా ఉందన్నారు. రవిగాంచని చోట కవి గాంచుతాడు అన్న నానుడిని గుర్తుచేస్తూ, కవి పరిధి విస్తృతంగా ఉంటుందన్నారు.

తల్లి మరణంతో వచ్చిన ఆవేదన, ఆవేశం నేపథ్యంలో శ్రీపాద శ్రీనివాస్ రచనలకు శ్రీకారం చుట్టారని, అందుకే ఈయన రచనల్లో ఆర్ద్రత ఉంటుందని పేర్కొన్నారు. మూడు పుస్తకాలను తీసుకొచ్చి, ఇప్పుడు నాల్గవ పుస్తకం తీసుకురావడం అభినందనీయమని అన్నారు.రచనలు కొనసాగించాలని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు కూడా అందుకోవాలని, ఇందుకు తనవంతు సహకారం అందించగలనని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

ఉండవల్లి మాట్లాడుతూ ఇంతమంది మిత్రులను సంపాదించుకోవడం మామూలు విషయం కాదని అన్నారు. మంచితనం కారణంగానే ఇంతమంది ఆదరణ పొందగలిగాడని



ఆయన పేర్కొంటూ నిజంగా ధన్యత పొందాడని అన్నారు. ఇదే ఒరవడి కొనసాగిస్తూ, రచనలు సాగిస్తూ, ఇంకా మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మాలాంటి ఎందరినో చైతన్య పరిచి, అవగాహన కల్పించిన శ్రీపాద శ్రీనివాస ధర్మాత్ముడని , మౌన ముని అని కొనియాడారు. ప్రస్తుత రాజకీయాలను ఆయన ప్రస్తావిస్తూ, బూతులు తిట్టేవాళ్ళకు, కొట్టేవాళ్లకు విలువ ఇచ్చే రోజులు నడుస్తున్నాయని, అందుకే వైసిపిలో ఇమడలేక పోయానని ప్రస్తావించారు. శ్రీపాద పుస్తకంలో రాజకీయాలకు సంబంధించిన కథ బాగుందని, మార్పు అనేది సాంస్కృతిక నగరమైన రాజమండ్రి నుచి ప్రారంభం కావాలని అన్నారు. దుర్మార్గ రాజకీయాలు పోవాలన్నారు. అందుకు శ్రీపాద శ్రీనివాస్ లాంటి వాళ్ళు చైతన్యవంతమైన రచనలు చేయాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే, రుడా మాజీ చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ అసెంబ్లీలో తాను ప్రశ్నలు వేయడానికి సహకారం అందించడమే కాకుండా పదేళ్లు ఎమ్మెల్యేగా చేసి ఖాళీగా ఉన్న సమయంలో చట్టసభల్లో గోదావరి గళం పేరిట పుస్తకం తీసుకొచ్చి, మళ్ళీ తనకు గుర్తింపు ఇచ్చిన మంచి స్నేహితుడు శ్రీపాద శ్రీనివాస్ అని కొనియాడారు. శ్రీపాద శ్రీనివాస్ కి ఇంతమంది స్నేహితులు ఉండడమే నిజమైన సంపద అన్నారు.

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే డా. సిహెచ్ వంశీ కృష్ణ మాట్లాడుతూ, అపారమైన జ్ఞానం కల్గిన శ్రీపాద శ్రీనివాస్ నిజాయితీ పరుడని కొనియాడారు. శ్రీపాద ఇంకా రచనలు చేయాలనీ, అవార్డులు, రివార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

నెల్లూరు జిల్లా ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి మాట్లాడుతూ.. శ్రీపాద శ్రీనివాస్ తో స్నేహం మొదలైన తీరుని గుర్తుచేసుకున్నారు. నెగెటివ్ లో సైతం పాజిటివ్ గా మార్చుకోవడం శ్రీపాదాలోని గొప్పతనమన్నారు. మాటలు పోయి, మూటలకు విలువ ఇస్తున్న ఈ రోజుల్లో నోరు మంచిదైతే ఊరు మంచిదన్న రాణిస్తున్నాడని కొనియాడారు.



సిసిసి ఛానల్ ఎండి పంతం కొండలరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టికె విశ్వేశ్వర రెడ్డి, శ్రీపాద శ్రీనివాస్ మిత్రులు ఆర్యాపురం బ్యాంకు డైరెక్టరు బుడ్డిగ రవి కొండలరావు, వక్కలంక నాగేంద్ర, తదితరులు మాట్లాడుతూ.. శ్రీనివాస్‌తో గల అనుబంధాన్ని వక్తలు ప్రస్తావించారు. అమ్మ, గోదావరి, స్నేహితులు, రాజకీయాలు కథా వస్తువులుగా ఎంచుకుని చేస్తున్న రచనల పరిధిని మరింత విస్తృతం చేస్తూ రచనలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

సీనియర్ పాత్రికేయులు వి ఎస్ ఎస్ కృష్ణకుమార్ అధ్యక్షత వహించారు. ప్రముఖ న్యాయవాది చింతపెంట ప్రభాకర్, పుస్తక సమీక్షచేస్తూ, శ్రీపాద శ్రీనివాస్ రచనలలో గొప్పతనాన్ని వివరిస్తూ, అమ్మ, గోదావరి, స్నేహితులు, రాజకీయాలు కథావస్తువులుగా ఎంచుకుని రచనలు చేస్తున్నారని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని రచనలు చేయాలన్నారు. రామినీడి మురళీమోహన్ కూడా వేదికపై ఉన్నారు.

శ్రీపాద శ్రీనివాస్‌ని మంత్రి దుర్గేష్, ఉండవల్లి దుశ్శాలువతో సత్కరించారు. ఉచిత రీతిన శ్రీపాద అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పలువురు పూలమాలలతో, దుశ్శాలువాలతో సత్కరించారు. షేక్ అసదుల్లా అహ్మద్, ప్రసాదుల హరినాథ్, క్రొవ్విడి సర్రాజు పసుపులేటి కృష్ణ, ఎల్ వెంకటేశ్వరరావు, నక్కా శ్రీనగేష్, ఇయ్యపు మాధవ, బెజవాడ రంగా, వాకచర్ల కృష్ణ, ముళ్ళా మాధవ, పలువురు ప్రముఖులు, శ్రీపాద శ్రీనివాస్ గురువులు, మిత్ర బృందం, తదితరులు పాల్గొన్నారు. రామకృష్ణమాచార్యులు వందన సమర్పణ చేస్తూ, మంగళా శాసనాలు చేశారు.

# డైవర్షన్ రాజకీయాల్లో భాగంగానే పోసాని అరెస్ట్

- బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలపై దృష్టి మళ్ళించే యత్నం
- మాజీ మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆగ్రహం

**రాజమహేంద్రవరం:** ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్ళించడానికి ప్రతిసారీ అమలు చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే సినీ ప్రముఖుడు పోసాని కృష్ణమురళిని అరెస్ట్ చేశారని వైయస్ఆర్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మండిపడ్డారు.

రాజమహేంద్రవరం రూరల్ పార్టీ కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ తో చెప్పించిన అబద్దాలు, ప్రధాన ప్రతిపక్ష గుర్తింపు వైయస్ఆర్సీపీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేని స్థితి నుంచి బయటపడేందుకు తాజాగా పోసాని కృష్ణమురళి అరెస్ట్ ను తెరమీదికి తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పోలీస్ యంత్రాంగాన్ని రాజకీయ వేధింపులకు వినియోగించుకుంటున్నారని ధ్వజమెత్తారు.

సినీ ప్రముఖుడు పోసాని కృష్ణమురళిని నిన్న ఆఘమేఘాల మీద హైదరాబాద్ కు పోలీసులను పంపి అరెస్ట్ చేశారు. కానీ ఎఫ్ఐఆర్ లో మాత్రం ఈ రోజు తేదీ వేసి కవర్ చేసుకునే ప్రయత్నం చేశారు. సోషల్ మీడియా యాక్టివిస్ట్ లపై బీఎన్ఎస్ 111 సెక్షన్ ను ఇష్టం వచ్చినట్లు ప్రయోగించకూడదని న్యాయస్థానాలు మొట్టికాయలు వేస్తున్నా ఈ ప్రభుత్వానికి చలనం లేదు.

కావాలనే సోషల్ మీడియా యాక్టివిస్ట్ లపై ఒకటి కంటే ఎక్కువ కేసులు పెట్టి, అనేక పోలీస్ స్టేషన్ల చుట్టూ రోజుల తరబడి




తిప్పి వేధిస్తున్నారు. ఈ రాష్ట్రంల మహిళలు, చిన్నారులపై నిత్యం అఘాయిత్యాలు జరుగుతుంటే, శాంతిభద్రతలు లేకుండా పోతుంటే దానిని నియంత్రించేందుకు పోలీస్ యంత్రాంగాన్ని వినియోగించకుండా, రాజకీయ వేధింపులు, కక్షసాధింపులకు వాడుతున్నారని చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ధ్వజమెత్తారు.

### పోసానిపై ప్రభుత్వ కక్షసాధింపు దారుణం : జూపూడి

**ఒంగోలు:** కూటమి ప్రభుత్వ కక్షసాధింపుల్లో భాగంగానే సినీ ప్రముఖుడు పోసాని కృష్ణమురళి అరెస్ట్ జరిగిందని వైయస్ఆర్ సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ రావు మండిపడ్డారు. ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ పోసానిపై బీఎన్ఎస్ 111 సెక్షన్ కింద కేసు నమోదు చేయడం దుర్మార్గమని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలపైనా వేధింపులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా యాక్టివీస్ట్ లపై నిరంకుశంగా వ్యవహరిస్తోందని అన్నారు. చట్టాలను ఉల్లంఘిస్తూ అధికార దుర్వినియోగంకు పాల్పడే పోలీస్ అధికారులు రానున్న రోజుల్లో న్యాయ వ్యవస్థకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన లేదని, చంద్రబాబు నిరంకుశ పాలనే సాగుతోందని ధ్వజమెత్తారు.

రాజకీయాల నుంచి దూరంగా ఉంటాను అని గతంలోనే పోసాని కృష్ణమురళి ప్రకటించినా కూడా ఈ ప్రభుత్వం ఆయనను వెంటాడుతోందని, ప్రజలు దీనిని గమనిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను వైయస్ఆర్ సీపీ ఎండగడుతుండటంతో జీర్ణించుకోలేక ఇటువంటి దుర్మార్గాలకు తెగబడుతున్నారని అన్నారు.



# 'ఛావా'... కాషాయ కాంతితో..

మనదేశంలో వచ్చిన గొప్ప సినిమాల్లో ఒకటి ఛావా. చాల గొప్ప సినిమా ఛావా.

దర్శకుడు లక్ష్మణ్ ఉతేకర్ ఉన్నతమైన ప్రతిభతో ఉత్కృష్టంగా తీసిన సినిమా ఛావా! ఒక దర్శకుడు ఒక కథను ఇంత గొప్పగా తెరకెక్కించడం విశేషంబీ ప్రత్యేకం. షాట్ మేకింగ్ చాల గొప్పగా ఉంది. అద్భుతమైన Frame senseతో సినిమాను నిర్మించాడు దర్శకుడు. విషువల్స్ కావ్య స్థాయిలో ఉన్నాయి. గొప్ప poetic senseతో సినిమాను సుసంపన్నం చేశాడు దర్శకుడు. సినిమా చివరి ఘట్టాలలో సాహసోపేతంగా కవిత్వాన్ని పొందుపరిచి సినిమాకు చవిని పొదివారు లక్ష్మణ్ ఉతేకర్.

శ్రేష్ఠమైన సినిమా టోగ్రఫీ. సౌరభ్ గోస్వామి aesthetic sense చాలా మేలుగా ఉంది. సంభాషణలు గొప్పగా ఉన్నాయి.

Tone and texture... సినిమా tone and texture విశేషంగా ఉన్నాయి. షాట్ షాట్‌లో మాత్రమే కాదు ఫ్రేమ్ ఫ్రేమ్ లోనూ దర్శకుడి ప్రతిభ ద్యోతకమౌతోంది. కథను, సంఘట నలను విప్పుకుంటూ, చెప్పుకుంటూ వెళ్లిన 'శైలి' ప్రతిభా వంతంగా ఉంది.

Pace... సినిమా pace చాలా ప్రత్యేకంగా ఉంది. అంతర్జాతీయ స్థాయి సంగీతం! ఎ.ఆర్. రహ్మాన్ back ground score అంతర్జాతీయ స్థాయిలో అమరింది. పాటలు కూడా మేలుగా ఉన్నాయి.

Emotion... సినిమాలో ఎమోషన్ అద్భుతంగా అలుముకుని హృదయంగమంగా ఉంది. విక్కికౌశల్ శంభాజీగా ఎంతో గొప్పగా నటించాడు. అక్షయ్ ఖన్నా ఔరంగజేబ్ పాత్రను చాల గొప్పగా చేశాడు. పాత్రకు తగ్గట్టు రశ్మిక సరిగ్గా నటించింది. సినిమాలో నటీనటులందరూ చాల మేలుగా నటించారు. విక్కి కౌశల్‌కూ, అక్షయ్ ఖన్నాకు జాతీయ అవార్డులు రావచ్చు.

మన దేశంలో ఇలాంటి అంతర్జాతీయ స్థాయి సినిమా వచ్చినందుకు కాస్తంత గర్వంగా ఉంది. ఈ అంతర్జాతీయ సినిమాలో హిందూత్వంతొణికిసలాడుతూండడం మరింత గర్వాన్ని కలగజేస్తోంది.

మనదేశంలో భారతీయతా భావాలతో ఇలాంటి సినిమాలు రావడం అవి ఘన విజయాన్ని సాధిస్తూండడం ఎంతో సంతోషకరం!

ఇటీవలి కాలంలో మనదేశంలో భారతీయతా భావాల లేదా సనాతన భావజాల సినిమాలు రావడం అవి సూపర్ హిట్స్ అవడం అన్న గొప్ప trend మొదలై వర్ధిల్లుతోంది.

మన తెలుగు సినిమా దర్శకులు రాజమౌళి, 'ఆర్.ఆర్.ఆర్' వంటి సినిమాతోనూ, బోయపాటి శీను 'అఖండ' వంటి సినిమాతోనూ, సుకుమార్ 'పుష్ప' సినిమాలోని 'జాతర' తోనూ, కన్నడంలో రిషబ్ శెట్టి 'కాంతారా' సినిమాతోనూ, మరి కొందరు దర్శకులూ Hindu-senseతో గొప్ప విజయాల్ని, జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని సాధించారు.

1960ల నుంచే మన సినిమాల్లో మస్లీమ్‌లు, క్రైస్తవులను మంచివాళ్లుగానూ, సినిమాల్లో విలన్‌లను హిందువులుగా మాత్రమే చూపిస్తున్న గర్హనీయమైన స్థితి ఉంది. ఇది ఒక రకమైన మానసిక బలహీనతబీ ఇది మానసిక బానిసత్వం. ఈ దుస్థితి నుంచి తెప్పరిల్లి ఇటీవలి కాలంలో మన సినిమా వాంఛనీయమైన, అభినందనీయమైన Hindu-Senseలోకి నడవడం గొప్ప పరిణామం.

'కాషాయ కాంతి'... ఛావా సినిమాలో కాషాయ కాంతి మెరుస్తూనూ, కాషాయ కాంతితో ఛావా సినిమా మెరుస్తూనూ పెద్ద స్థాయి జనామోదాన్ని జనాదరణనూ అందుకుంది! విదేశీ వర్ణాలు, జనహానికర కొడవలి-సుత్తి మన సినిమాకు ఇక వద్దు. సినిమాల ద్వారా కూడా విదేశీ మతోన్మాదానికి, విదేశీ విధ్వంసక భావజాలానికి మనం తీవ్రంగా గాయపడ్డాం. ఇక మనం పుంజుకోవాలి. మన సినిమాల్లో విదేశీ వర్ణాలు కాదు మన సినిమాల్లో మన మట్టి రంగు మెరుస్తూండాలి.

ఛావా లాంటి సినిమాల అవసరం ఇప్పటి పరిస్థితుల్లో మన దేశానికి ఎంతైనా ఉంది.

India needs Hindu-sense movies

జాతీయతా భావాల సినిమాల వెల్లువ మన దేశంలో రావాలి. ఛావా విజయం మనదేశ సినిమాకు దిశా నిర్దేశం చేస్తోంది.

ఛావా నిన్నటి వరకూ 360కోట్ల పైచిలుకు కలెక్షన్లతో... 800 కోట్ల కలెక్షన్స్ రాబడుతుందని అంచనా వేస్తున్నారు...

అన్ని రకాలుగానూ An epitome of excellence ఛావా'

An exqisite and an exemplary movie ఛావా'.

ఛావా దర్శకుడి ప్రతిభకు ప్రత్యేక అభినందనలు. విక్కి కౌశల్‌కూ, అక్షయ్ ఖన్నాకు ప్రత్యేక అభినందనలు.



- రోచిష్మాన్

9444012279

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

06

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, ఫిబ్రవరి 2025

# పోసానిపై అప్పుడే ఫిర్యాదు చేశా..

- పవన్‌పై పోసానివి అసభ్య వ్యాఖ్యలు
- నిద్ర లేని రాత్రులు గడిపా
- జనసేన సీమ కన్వీనర్ జోగిమణి



ఓబులవారిపల్లె: తమ నాయకుడు పవన్ కుటుంబ సభ్యుల గురించి పోసాని అనుచితంగా మాట్లాడు తుంటే తాము కూడా అలాగే మాట్లాడా లను కున్నామని, అయితే అలా మాట్లాడొద్దని పవన్ సూచించారని జనసేన రాయలసీమ జోన్ కన్వీనర్ జోగిమణి తెలిపారు. సంస్కారం అడ్డొచ్చి తాము అలా మాట్లాడలేదని, పోసాని ప్రవర్తన సరిగా లేకపోవడం వల్లే ఆయనపై ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని చెప్పారు.

పవన్ పై పోసాని చేసిన వ్యాఖ్యలు విని ఎన్నో నిద్రలేని రాత్రులను గడిపానని జోగిమణి తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కూడా పోసానిపై ఎన్నో ఫిర్యాదులు చేశామని, అప్పుడు తమ ఫిర్యాదులు తీసుకోలేదని చెప్పారు. ఇష్టాను సారం మాట్లాడడం సమంజసం కాదని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని అన్నారు. జోగిమణి ఫిర్యాదు మేరకు పోసానిపై అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.



# ఎమ్మార్ ప్రాపర్టీ కేసుల పరిష్కారానికి లీగల్ ఏజెన్సీ

- అభ్యర్థించిన ఎమ్మార్ ప్రాపర్టీ బృందం
- సీఎం రేవంత్‌రెడ్డి అంగీకారం

హైదరాబాద్: వివిధ కేసులతో పెండింగ్‌లో ఉన్న తమ ప్రాజెక్టుల వివాదాలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మార్ ప్రాపర్టీస్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మార్ ప్రతినిధులతో సమావేశ మయ్యారు. ఎమ్మార్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అలబ్బర్, భారత్ లో యూఏఈ మాజీ రాయబారి డాక్టర్ అహ్మద్ అల్ బన్నా, ఎమ్మార్ గ్రూప్ సీఈవో అమిత్ జైన్, ఆ కంపెనీ ఇంటర్నేషనల్ అఫైర్స్ హెడ్ ముస్తఫా అక్రమ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి,పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి, ఈ సమావేశంలో పాల్గొన్నారు.

2001లో ఉమ్మడి రాష్ట్రంలో దుబాయ్కు చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్ హైదరాబాద్లో కన్వెన్షన్ సెంటర్, హోటల్, గోల్ఫ్ కోర్సు, విల్లాలు తదితర ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు అప్పటి ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. ఏపీఐఐసీతో ఆ సంస్థ చేసుకున్న ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని అప్పట్లో సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయి. ఏజెన్సీల దర్యాప్తులు, కోర్టుల్లో విచారణలు కొనసాగుతున్నాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 2015 అక్టోబర్ లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మార్ ప్రాపర్టీస్ కు సంబంధించిన ప్రాజెక్టుల వివాదాల పరిష్కారానికి ఛీఫ్ సెక్రెటరీ సారథ్యంలో అయిదుగురు సెక్రెటరీల కమిటీని ఏర్పాటు చేసింది. మరోవైపు కేంద్ర విదేశాంగ శాఖ, సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియాకూడా ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. ఎమ్మార్ ప్రతినిధులతో జరిగిన చర్చల సందర్భంగా ఈ అంశాల న్నింటినీ అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. వివిధ దర్యాప్తు ఏజెన్సీల కేసులు, ఛార్జ్ షీట్లు, న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్నందున ఎమ్మార్ ఒప్పందాల డాక్యుమెంట్లు, కోర్టు కేసుల వివరాలతో పాటు కేంద్ర ప్రభుత్వ సూచనలన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు 2015లో చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి అదనంగా న్యాయ నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. న్యాయ వివాదాలను అధ్యయనం చేయడానికి, సామరస్య పూర్వక పరిష్కారం చేసుకోవడానికి యూఏఈ ప్రభుత్వ ఆమోదంతో ఒక లీగల్ ఏజెన్సీని ఏర్పాటు చేస్తామని సంస్థ ప్రతినిధులు ప్రతిపాదించగా, వారి ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమోదించారు.

ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీ వారితో సంప్రదింపులు జరిపి తదుపరి సూచనలు, సలహాలు అందిస్తుందని చెప్పారు.

## మా చిన్న పరిశ్రమలు బతకాలంటే

# సింగరేణి బొగ్గు ధర తగ్గించాలి



- సింగరేణి ధర అందుబాటులో లేనందునే వేరే చోట కొనుగోలు చేస్తున్నాం
- మాపై ఆధారపడిన వేల మంది చిన్న ఉద్యోగుల ఉపాధి కూడా మాకు ముఖ్యమే
- సింగరేణితో ఏళ్ల తరబడి ఉన్న అనుబంధం కోల్పోవాలని కూడా లేదు
- సింగరేణి భవన్ లో సీఎండీ ఎన్.బలరామ్‌కు విద్యుత్తేతర బొగ్గు వినియోగదారుల విజ్ఞప్తి

హైదరాబాద్: బొగ్గు ఆధారిత సిమెంటు, స్పాంజ్, ఐరన్, సిరామిక్స్, ఫార్మా వంటి పరిశ్రమలు నేటి క్లిష్ట మార్కెట్ పరిస్థితుల్లో మనుగడ సాగించాలంటే సింగరేణి సంస్థ తన బొగ్గు ధరను తగ్గించాల్సిన అవసరం ఉందని విద్యుత్తేతర పరిశ్రమల యాజమాన్యాలు సింగరేణి సంస్థకు మొర పెట్టుకున్నాయి. ముఖ్యంగా తమ పరిశ్రమల మనుగడ, తమపై ఆధారపడిన వేల మంది స్థానిక చిరు ఉద్యోగుల భవిష్యత్ దృష్ట్యా తక్కువ ధరకు బొగ్గును విదేశాల నుంచి లేదా ఇతర బొగ్గు సంస్థల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందన్నారు.

తొలిసారిగా అన్ని ఏరియాల జీఎంలు, క్వాలిటీ జీఎంలు, క్వాలిటీ ఇన్చార్జ్‌లతో కలిసి సింగరేణి భవన్‌లో గురువారం సంస్థ నిర్వహించిన విద్యుత్తేతర వినియోగదారుల సమావేశంలో దాదాపు 60కి పైగా సంస్థల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. గత ఏడాది సింగరేణి ఉత్పత్తి చేసిన 70 మిలియన్ టన్నుల బొగ్గులో 9 మిలియన్ టన్నులను విద్యుత్తేతర వినియోగదారులు కొనుగోలు చేశారని, ఈ ఏడాది కేవలం 5 మిలియన్ టన్నులను మాత్రమే తీసుకోవడానికి కారణాలను ఈ సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్ తెలుసుకున్నారు.

దీనిపై అన్ని సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ... సింగరేణి తో తమకు దశాబ్దాల అనుబంధం ఉందన్నారు. రవాణా సమస్యలు లేకుండానే సింగరేణి నుంచి బొగ్గు తీసుకునే అవకాశం కూడా ఉందన్నారు. కానీ, పోటీ మార్కెట్లో ఇప్పటికే తాము ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నామని, సింగరేణి బొగ్గు ధరలు ఎక్కువ ఉన్నందున తాము అంతకన్నా తక్కువ ధరకు లభిస్తున్న కోలిండియా మరియు విదేశీ బొగ్గు వైపు మొగ్గు చూపాల్సి వస్తుందని పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి బొగ్గును కొనుగోలు చేస్తున్నప్పటికీ సింగరేణి ధరతో పోల్చితే తక్కువకే లభిస్తోందన్నారు. బొగ్గు ధరను తగ్గిస్తే సింగరేణి నుంచి స్వీకరించడానికి సంసిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

బొగ్గు నాణ్యత విషయంలోనూ లేవనెత్తిన అంశాలపై సంబంధిత అధికారులకు సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాలు జారీ చేశారు. నాణ్యత విషయంలో కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వినియోగదారుల ప్రయోజనాలను, సింగరేణి మార్కెట్ను రక్షించుకునేందుకు అవసరమైన అన్ని చర్యలపై సమాలోచనలు జరిపి తగిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన రోజుల్లో సింగరేణి నుంచి బొగ్గును స్వీకరించాలని కోరారు. త్వరలో మరొక సమావేశాన్ని కూడా ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు.

సమావేశంలో డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), ఎగ్జిక్యూటివ్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం.సుభానీ, జీఎం(మార్కెటింగ్) డి.రవి ప్రసాద్, జీఎం(సీపీపీ) మనోహర్, ఓఎస్డీ (మార్కెటింగ్) ఎన్.వి.రాజశేఖర రావు, డీజీఎంలు సురేందర్ రాజు, శ్రీవాస్తవ, అడిషనల్ మేనేజర్ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నవభారత్, ఐటీసీ, ఓరియంట్ సిమెంట్, అల్ట్రా టెక్ సిమెంట్, దివీస్ ల్యాబరేటరీస్, హెటిరో ఫార్మా, సిర్పూర్ పేపర్ మిల్స్ తదితర సంస్థల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

# వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీకి నిధులు సమకూరుస్తాం

- వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీని దేశంలోనే ఉత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దుతాం
- యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న హెరిటేజ్ బిల్డింగ్స్ ను పరిరక్షించి పునరుద్ధరణ చేస్తాం
- యూనివర్సిటీ నూతన భవన నిర్మాణ ప్రదేశాలు, నమూనాలను పరిశీలించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క





హైదరాబాద్: దేశంలోనే ఉత్తమ యూనివర్సిటీగా వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీని తీర్చిదిద్దడానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు కావలసిన నిధులను సమకూరుస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. గురువారం వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ (కోటి ఉమెన్స్ కాలేజ్)ని సందర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న హెరిటేజ్ బిల్డింగ్స్ ను పరిరక్షణ చేయడంతో పాటు పునరుద్ధరణ చేయడానికి కావలసిన నిధులను ప్రభుత్వం ఇస్తుందని వెల్లడించారు.

మహిళా విద్యార్థులకు కావలసిన తరగతి గదులు, ల్యాబ్స్, లైబ్రరీ, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉండడానికి కావలసిన వసతి గృహాలు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కార్యాలయం, అతిథి గృహం, ఆడిటోరియం, పరిపాలన విభాగానికి సంబంధించిన భవనాల నిర్మాణాలకు సంబంధించిన ప్రదేశాలను పరిశీలించి, ఇంజనీరింగ్ అధికారులు రూపొందించిన భవన నిర్మాణ నమూనాలను తిలకించారు. ఇటీవల పునరుద్ధరణ చేసిన దర్బార్ మహల్ హెరిటేజ్ బిల్డింగును పరిశీలించారు. దర్బార్ మహల్ పై అంతస్తులో 1779 – 1947 మధ్య, హైదరాబాదులో పనిచేసిన 57 మంది బ్రిటిష్ రెసిడెంట్లకు సంబంధించిన చిత్రపటాలు, వారి పదవీ కాలంలో హైదరాబాద్ నగర రాజకీయ, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో చేసిన అభివృద్ధికి సంబంధించి ప్రదర్శించిన చిత్రపటాలను ఆసక్తిగా తిలకించారు.

పూర్వపు బ్రిటిష్ రెసిడెన్సికి సంబంధించిన చరిత్రను విజిటర్ మేనేజర్ సతీష్ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సమగ్రంగా వివరించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీలో నూతనంగా నిర్వహించే భవనాలకు సంబంధించి రూపొందించిన నమూనాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యాశాఖ అధికారుల సమక్షంలో ఇంజనీరింగ్ అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కు వివరించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న గార్డెన్స్‌లో పచ్చదనాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు అందరిని ఆకట్టుకునే విధంగా మూసిని అనుసంధానం చేయడానికి తయారు చేసిన ప్రతిపాదనలను ఉప ముఖ్యమంత్రికి చూపించారు.

యూనివర్సిటీలో నూతనంగా నిర్మాణం చేసే భవనాలు రాబోయే తరాలకు వారసత్వ కట్టడాలుగా చరిత్రలో మిగిలిపోయే విధంగా ఉండాలని, ఆ విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రానా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పూజారి గౌతమి, తెలంగాణ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతి రెడ్డి, యూనివర్సిటీ ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ సూర్య ధనుంజయ్, ప్రిన్సిపల్ లోక పావని తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ్ కుమార్ రెడ్డికి సిగ్గుండాలి

- రేవంత్ రెడ్డికి ఇక్కడికి వచ్చి చూసే టైం లేదు
- 8 మంది ప్రాణాలు ముఖ్యమా, ఎన్నికల ప్రచారం ముఖ్యమా?
- ఆంధ్ర ప్రభుత్వం కృష్ణ నీళ్లు తరలిస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదు?
- శ్రీశైలం ఖాళీ అవుతుంటే ప్రభుత్వం నిద్రపోతున్నదా?
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో నాలుగు ప్రాజెక్టులు కుప్పకూలాయి
- గత ప్రభుత్వానికి ఇప్పటి ఘటనలు ఏం సంబంధం?
- పని ప్రారంభించేటప్పుడు జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిపోర్ట్ ఇచ్చిందా?
- ఆరు రోజుల్లో తట్టెడు మట్టి కూడా తీయలేదు
- మంత్రులు పొద్దున వస్తున్నారు సాయంత్రం పోతున్నారు.. ఇదేమైనా టూరిస్ట్ ప్లేసా
- ఎస్ఎల్బిసి టన్నెల్ వద్ద మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి
- హరీష్ రావు వ్యాఖ్యలు

హైదరాబాద్,మహానాడు: సహాయక చర్యలు జరుగుతున్నాయనీ, కొద్ది రోజులు ఆగి వెళ్లాలని కేసీఆర్ సూచించారు. అందుకే ఇప్పటి దాకా సంయమనం పాటించాం. కానీ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉంది. ఆరు రోజుల్లో తట్టెడు మట్టి కూడా తీయలేదు. ఆరు రోజుల్లో 8 మంది ప్రాణాలు కాపా టంలో రాష్ట్ర ప్రభుత్వం చేసింది సున్నా పని. అందుకే మేము ఈరోజు ఇక్కడ ఏం జరుగుతుంది అని తెలుసుకునేందుకు వచ్చాం.

బాధితకుటుంబాలను పరామర్శించటానికి వచ్చాము. అయినా మమ్మల్ని అడ్డుకున్నారు. ప్రజా ప్రతినిదులను అని చూడకుండా ఆపారు. అయినా మేము, మా సభ్యులు పోలీసులకు సహకరించాం. వివిధ బృందాల మధ్య సమన్వయం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. ఎవరు ఏం పని చేయాలి? ఎలా ముందుకు వెళ్లాలి అనే విషయంలో డైరెక్షన్ లేకుండా ఉన్నారు.

ఆరు రోజుల వరకు డైరెక్షన్ ఇవ్వకుండా ప్రభుత్వం ఉండడం ఏమిటి? లోపల ఉన్న వాళ్ళ ప్రాణాలు ఏమైపోవాలి? ఏ రకంగా ముందుకు పోవాలని నిర్ణయం తీసుకోవడానికి ఆరు రోజులు పడుతుందా? మంత్రులు పొద్దున వస్తున్నారు సాయంత్రం పోతున్నారు. ఇదేమైనా టూరిస్ట్ ప్లేసా? హెలికాప్టర్లు వేసుకొని తిరుగుతున్నారు. హెలికాప్టర్లు వేసుకొని ఎన్నికల ప్రచారం పోతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంతవరకు రాడు, డైరెక్షన్ లేదు. మంత్రిగారు రోజు పొద్దున వస్తుండు, సాయంత్రం పోతున్నాడు. ఇంతకంటే ముఖ్యమైన పని ఏముంటది రాష్ట్రంలో డైరెక్షన్ ఇచ్చే బాధ్యత ప్రభుత్వానికి లేదా?

ఇవ్వాలా అరో రోజు. ఇప్పటికీ కన్వేయర్ బెల్టు పనిచేయడం లేదు. దాన్ని రిపేర్ చేయడానికి ఆరు రోజులు పడుతుందా? గంటల్లో పూర్తి చేసే పని. కన్వేయర్ బెల్టు పనిచేస్తే లోపల ఉన్న శిథిలాలు వంటివి బయటకు తీసుకురావడానికి సాధ్యమైతది. టన్నెల్ బోర్



మెషిన్ యొక్క పార్ట్స్ చెల్లాచెదురుగా పడి ఉన్నాయన్నారు. అవి కట్ చేసి, తీసుకురావాలా వద్దా అని నిర్ణయించ డానికి నాలుగు రోజులు సమయం తీసుకున్నారు. ఆ నాలుగు రోజులు లోపల ఉన్న వాళ్ళ పరిస్థితి ఏమిటి?

అది కట్ చేయాలనీ తొందరగా నిర్ణయం తీసుకొని, ఫాస్ట్ గా డీ వాటరింగ్ చేసి, కన్వేయర్ బెల్ట్ ఓకే చేసి దాని ద్వారా అడ్డంకిగా ఉన్నవి బయటికి తేవాల్సి ఉండే. ఆరు రోజుల తర్వాత తట్టెడు మట్టి తెచ్చారు. 8 మంది ప్రాణాలు కాపాడటం పట్ల ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా?

సహాయక బృందాలు, కంపెనీ వారు, లేబరు, అధికారులు అందరితో మాట్లాడా. కన్వేయర్ బెల్టు ఎప్పటి వరకు అవుతుంది అని అడిగితే.. రెండు రోజులను ఒకరంటారు, ఉత్తం గారేమో రెండు రోజుల్లో మొత్తం ఆపరేషన్ అయిపోతుందంటాడు. ఆరు రోజులైనా కన్వేయర్ బెల్ట్ ఇప్పటికీ ఉపయోగంలోకి రాదు, బురద, డెబ్రిస్ ని బయటికి తీసుకురారు. ఎవరితోనైనా మాట్లాడే ప్రయత్నం చేస్తుంటే అడ్డుకుంటున్నారు. టన్నెల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తే అడ్డుకుంటున్నారు.

కాంగ్రెస్ నాయకులు టన్నెల్లోకి పోయినప్పుడు.. గతంలో నీటిపారుదల శాఖ మంత్రిగా, విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేశాము మాకు అనుమతి లేదా? బాధ్యత గల మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు వస్తే అడ్డు కుంటారా? ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. బాధగలిగే విషయం ఏమిటంటే, మేము బాధ్యతతో సంయమనంతో ఉంటే, రెస్క్యూ కొనసాగాలే ఎనిమిది మంది ప్రాణాలతో బయటకు రావాలని కోరుకుంటే.. కాంగ్రెస్ పార్టీ వాళ్లు రాజకీయాలు చేస్తున్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల టన్నెల్ కూలిందని ఉత్తంకుమార్ రెడ్డి ఇక్కడ కూర్చొని మాట్లాడుతున్నాడు. మాట్లాడడానికి సిగ్గుండాలి. గత ప్రభుత్వానికి ఇప్పటి ఘటనలు ఏం సంబంధం? పని ప్రారంభించేటప్పుడు జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిపోర్ట్ ఇచ్చిందా? ఇస్తే అది బయట పెట్టండి. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రాక్స్ మెకానిక్ పిలిచి వాళ్ళ ఒపినియన్ తీసుకున్నారా? ఉంటే ఆ రిపోర్టు బయట పెట్టండి. ఆదరా బాదరా ఆగమాగం చేసి ప్రాణాలు బలిగొన్నరు ప్రాజెక్టు కుప్పకూలిపోయే పరిస్థితి. గత ప్రభుత్వం పనే చేయలేదని ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతున్నాడు. చదువుకున్న వారు విజ్ఞానవంతులు మంత్రిగా ఉన్నారు రికార్డులు చూసుకోండి. 9 ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్ఎస్బీసీ లో 3300 కోట్ల రూపాయల పని జరిగితే.. 9 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో 3900 కోట్ల రూపాయల పని ఈ ప్రాజెక్టులో జరిగింది. మీకంటే 600 కోట్ల రూపాయల పని మేము ఎక్కువగా చేసినం. రెండేళ్లు వరుసగా కరోనా వచ్చినా, 10,000 లీటర్ల సీపేజి వచ్చినా ఇబ్బందులు వచ్చినా కూడా దాదాపు 12 కిలోమీటర్ల టనల్ పూర్తి చేసాము. దిండి రిజర్వాయర్ ను, పెల్లిపాక రిజర్వాయర్ ను ఈ ప్రాజెక్టులో భాగంగా ఉన్న వాటికి భూసేకరణ పూర్తి చేసి ఆ ప్రాజెక్టును 90% పూర్తి చేసాము. కానీ మైకుల ముందు నోటికి వచ్చినట్టు గత ప్రభుత్వం పని చేయలేదని మాట్లాడుతాడు. మంత్రి జూపల్లి 5 కిలోమీటర్లు మాత్రమే పనిచేసిన అంటడు. మా ప్రభుత్వంలో నేను నీళ్ల మంత్రిగా ఉన్నప్పుడు నాతో పాటు సహచర మంత్రిగా ఇదే టన్నెల్ కు నాతో వచ్చిండు. పార్టీ మారగానే ప్లేట్ ఫిరాయించి నాలుక మడత పెడుతున్నాడు. దివాలాకోరు దిగజారుడు రాజకీయాలు చేయకండి

చాలా విషయాలు మాట్లాడేది ఉంది. సమయం సందర్భం కాదని ఓపిక పడుతున్నాం. ఇప్పటికైనా సహాయక చర్యలు చేస్తున్న బృందాల మధ్య సమన్వయం తీసుకురండి. వేగంగా డెబ్రిస్ తీసే చర్యలు చేపట్టండి. నిపుణుల సలహాలు తీసుకోండి వేగవంతంగా చేయండి. ఆరు రోజులు అంటే ఎంత అమూల్యమైనవి. మంచినీళ్లు లేకుండా ఆహారం అందకుండా ఆక్సిజన్ లేకుండా వారి ప్రాణాలు ఏం కావాలి? ఆ దారుణమైన పరిస్థితిలో ఉన్న వారి స్థానంలో ఉండి ప్రభుత్వం ఆలోచించాలి.

కరోనా వచ్చినప్పుడు ఇతర రాష్ట్రాల వారిని ఎంతో బాగా చూసుకున్నారు. ట్రైన్ టికెట్లు ఇచ్చి భోజనాలు పెట్టి సొంత ఊళ్ళో పంపించారు. కానీ మీరు ప్రాణాలు తెగించి రాష్ట్రం కోసం ప్రాజెక్టులు కడుతున్న వారి ప్రాణాలను కాపాడటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రేవంత్ రెడ్డికి ఇక్కడికి వచ్చి చూసే టైం లేదు. ఢిల్లీ కో కరీంనగర్ కో వెళ్లి మాట్లాడుతున్నాడు. హెలికాప్టర్ వేసుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడు మరొక మంత్రి హెలికాప్టర్ లేదని హైదరాబాదులో ఉన్నాడు.

హెలిక్యాప్టర్ దొరుకుతేనే ఇక్కడకు వస్తా అనే పరిస్థితి మంత్రి ఉత్తమ్ ది. ముఖ్యమంత్రికి మంత్రికి 8 మంది ప్రాణాలు ముఖ్యమా, ఎన్నికల ప్రచారం ముఖ్యమా? రేవంత్ రెడ్డి ఎందుకు ఇక్కడకు రావడం లేదు ఎందుకు డైరెక్షన్ ఇవ్వడం లేదు. ఎందుకు రేవంత్ రెడ్డి సమీక్షించడం లేదు? ఎందుకు ఆ కుటుంబాలకు ధైర్యం చెప్పడం లేదు? ముఖ్యమైన ప్రాజెక్టు కుప్పకూలిపోతే పట్టించుకున్న పాపాన పోవడం లేదు ముఖ్యమంత్రి..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో నాలుగు ప్రాజెక్టులు కుప్పకూలాయి. ఖమ్మం జిల్లాలో పెద్దవాగు కొట్టుకుపోయింది, సుంకిశాల కుప్ప కూలింది. పాలమూరు పథకంలోని వట్టెం పంప్ హౌస్ జలమయమైంది. ఇవాళ ఎస్ఎల్బీసీ టన్నెల్ కూలింది. అసలు ఈ ప్రభుత్వం ఏం చేస్తుంది? ఉన్న నీళ్లను కూడా కాపాడలేని దుస్థితి మీది. శ్రీశైలం మొత్తం ఖాళీగా కనిపిస్తున్నది.

ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు తాగునీరు దీనిపైన ఆధారపడి ఉంటుంది. మొత్తం శ్రీశైలం ఖాళీ అవుతుంటే ప్రభుత్వం నిద్రపోతున్నదా? చేతగానట్టు చేవ లేనట్టు ఈ ప్రభుత్వం ఎందుకు పనిచేస్తున్నది. ముచ్చుమరి నుంచి పోతిరెడ్డిపాడు నుంచి నీళ్లు తీసుకుపోతుంటే ఎందుకు చోద్యం చూస్తున్నారు. ఆపే బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా? సాగర్ లోనూ నీళ్లు లేని పరిస్థితి. ఆరున్నర లక్షల ఎకరాల సాగరాయకట్టు ఉంది. రెండున్నర లక్షల 50 వేల ఎకరాలు మహబూబ్నగర్ లో ఉన్నది. దాదాపు పది లక్షల ఎకరాలు ఆయకట్టు ఆధారపడి ఉన్నది.

ఆంధ్ర ప్రభుత్వం కృష్ణ నీళ్లు తరలిస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? కె ఆర్ ఎం బి కి ఫిర్యాదు చేసి ఎందుకు అడ్డుకోవడం లేదు? టిఆర్ఎస్ పార్టీ ముళ్ళు కర్ర బట్టి పోలిస్తే తప్ప ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర వదలడం లేదు. మొదటి కె ఆర్ ఎం బి మీటింగ్ లోనే ఒప్పుకొని వచ్చారు. సెక్షన్ 3 కింద నీటి పంపకాలు అయ్యేవరకు ప్రాజెక్టులు అప్పగించేది లేదు అని కేసీఆర్ గర్జించారు. మీరు నిర్ణయాన్ని వాపస్ తీసుకుంటున్నామని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. చంద్రబాబు గోదావరి నీళ్లను బనకచర్ల లింకు ద్వారా ఆంధ్రకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు. నేను ప్రెస్ మీట్ పెట్టి ప్రశ్నిస్తే, నిలదీస్తే అప్పుడు మూడు రోజుల కింద బ్యాక్ డేట్ వేసి ఉత్తరం రాసిండు. రాష్ట్ర ప్రయోజనాలు మీకు పట్టవు, కుర్చీల కొట్లాట మీ మధ్య ఉంది. మొన్న కృష్ణా జలాలు కుడి కాల్వ ద్వారా రోజు 10 వేల క్యూసెక్కులు తరలిస్తున్నారని నేను మాట్లాడితే అప్పుడు ఛైర్మెన్ వద్దకు వెళ్లిండు. రాష్ట్ర ప్రయోజనాలు, హక్కులు కాపాడడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయింది.

### ఎస్ ఎల్ బి సి రూపకల్పన చేయడమే లోప భూయిష్టం: నిరంజన్ రెడ్డి

వీలైనంత త్వరగా నీళ్లు రా వద్దనే ఉద్దేశంతోనే నాటి పాలకులు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. నల్గొండ రైతాంగానికి నీళ్ళు రావాలని తెలంగాణ ప్రజలు బాగుపడాలని సంకల్పించింది కాదు. ఇదే విషయాన్ని కేసీఆర్ హరీష్ రావు చాలాసార్లు అసెంబ్లీలో చెప్పారు. ఎస్ ఎల్ బి సి రూపకల్పన చేయడమే లోప భూయిష్టం. పోతిరెడ్డిపాడు పనులు పూర్తి చేసి నీళ్లు తీసుకెళ్తున్నారు కానీ, ఎస్ ఎల్ బి సి పూర్తి చెయ్యలేదు. ఎస్ ఎల్ బి సి ఎన్నటికీ పొడవని ముచ్చట చేశారు.

2005 లో వై ఎస్ మొదలు పెట్టారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో కేసీఆర్ , హరీష్ రావు 11.5 మీటర్ల టన్నెల్, 60 కిలోమీటర్ల పై చిలుకు రెండేళ్లలో పూర్తి చేశారు. ఫలితానికి సిద్ధం చేసినం. అవసరం అయిన చోట ఆడిట్స్ పెట్టినం. నీళ్ళు ఇవ్వాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. సరైన జాగ్రతలు తీసుకోలేదు. 8 మంది సొరంగంలో ఇరుక్కోవడం బాధాకరం.

### ప్రభుత్వ నిర్లక్ష్యం : జగదీష్ రెడ్డి

ఆరు రోజులుగా చిక్కుకున్న వారి ఆచూకీ తెలియక పోవడం బాధాకరం. ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నది. ఒత్తిడి వల్ల జరిగింది. సరైన నిపుణుల సలహాలు తీసుకోలేదు అంటున్నారు. మంత్రులు వస్తున్నారు ఫోటోలకు ఫోజులు ఇచ్చి పోతున్నారు. ఈరోజు మాత్రమే తట్టెడు మట్టి తీసుకువచ్చారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మేము సంయమనం పాటిస్తూ వచ్చాం.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, ఫిబ్రవరి 2025 ||







# హెచ్‌సియులో కూలిన బిల్డింగ్ ఎక్స్టెన్షన్

- ఐదుగురు కార్మికులకు తీవ్ర గాయాలు
- నిర్మాణంలో ఉండగ నే కూలిన వైనం
- నాసిరకం నిర్మాణమే కారణమా?

**హైదరాబాద్:** హైదరాబాద్ యూనివర్సిటీ (HCU)లో నిర్మాణంలో ఉన్న అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఎక్స్టెన్షన్ కూలిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు కార్మికులు గాయపడ్డారు, వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, నిర్మాణంలో ఉన్న స్తంభాలు మరియు కాంక్రీట్ స్లాబ్‌లు కూలిపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగింది.

ప్రమాదానికి కారణాలను తెలుసుకోవడానికి యూనివర్సిటీ అధికారులు మరియు స్థానిక పోలీస్ శాఖ సంయుక్తంగా దర్యాప్తు ప్రారంభించారు. నిర్మాణ నిబంధనలు పాటించడంలో ఏమైనా లోపాలు ఉన్నాయా అని పరిశీలిస్తున్నారు. కాగా నాసిరకం నిర్మాణం వల్లనే యూనివర్శిటీలో బిల్డింగ్ ఎక్స్టెన్షన్ కూలిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టాలన్న డిమాండ్ తెరపైకొచ్చింది.

# శవాల మీద పేలాలు ఏరుకునే ప్రయత్నం

- సొరంగంలో చిక్కుకున్న వారిని బయటకు తెచ్చేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నాం
- కృష్ణ బేసిన్‌లోని ప్రాజెక్ట్‌లను గత బీఆర్ఎస్ పాలకులు కావాలనే నిర్లక్ష్యం చేశారు
- దక్షిణ తెలంగాణ ప్రాజెక్ట్‌లు దశాబ్దకాలంగా గత ప్రభుత్వంలో వివక్షకు గురయ్యాయి
- ఎస్ఎల్బీసీ ప్రాజెక్ట్ గురించి ప్రశ్నించే హక్కు, మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదు
- బీఆర్ఎస్ నేతలు శవాల మీద పేలాలు ఏరుకునే ప్రయత్నం చేస్తున్నారు
- గత ప్రభుత్వ తప్పిదాలకు మాపై అభాండాలు వేయడం సరికాదు
- బీఆర్ఎస్ ఎస్ఎల్బీసీ పూర్తి చేసి ఉంటే ఇవాళ ఈ పరిస్థితి వచ్చేది కాదు
- మంత్రి జూపల్లి కృష్ణారావు

**వనపర్తి:** కృష్ణ బేసిన్‌లోని సాగునీటి ప్రాజెక్ట్‌లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం చేసిందని, మళ్ళీ ఇప్పుడు వచ్చి మాపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్ నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే మెఘారెడ్డి, ఎంపీ మల్లురవితో కలిసి మంత్రి జూపల్లి మీడియా సమావేశంలో మాట్లాడారు.

దక్షిణ తెలంగాణ వరప్రదాయిని లాంటి పాలమూరు- రంగారెడ్డి, ఎస్ఎల్బీసీ వంటి ప్రాజెక్ట్ లను పూర్తి చేయడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. కృష్ణ బేసిన్ లోని సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేయాలనే చిత్తశుద్ధి గత ప్రభుత్వానికి లేదని, ఉద్దేశపూర్వకంగా ఈ ప్రాంత ప్రాజెక్ట్ లకు నిధులు కేటాయించకుండా పనులను పెండింగ్ పెట్టారని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిర్వాహకం వల్ల ప్రతి సంవత్సరం 100 టీఎంసీల నీటిని నిలువ చేసుకునే సామర్థ్యాన్ని దక్షిణ తెలంగాణ ప్రాజెక్ట్ లు కొల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో మంజూరైన ప్రాజెక్ట్ లను నిర్లక్ష్యం చేసిన మాటా వాస్తవం కాదా? ,ఈ ప్రాంత ప్రాజెక్ట్ లను పూర్తి చేయకుండా.. దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చింది బీఆర్ఎస్ కాదా? అని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్ట్ లను పూర్తి చేస్తే కాంగ్రెస్ కు ఎక్కడ పేరొస్తుందని పెండింగ్ లో పెట్టారా? అని అన్నారు

ఎస్ఎల్బీసీ ప్రాజెక్ట్ గురించి ప్రశ్నించే హక్కు, మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదన్నారు. బీఆర్ఎస్ తొమిదన్నర ఏళ్ల తమ



పాలనలో ఎందుకు ఎల్ఎల్బీసీ పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఎస్ఎల్బీసీని సందర్శించే నైతిక హక్కు హరీష్ రావు లాంటి బీఆర్ఎస్ నేతలకు లేదని స్పష్టం చేశారు.

అప్పుడే మీరు ఈ ప్రాజెక్ట్ ను పూర్తి చేసి ఉంటే ఇవాళ ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పారు. సొరంగంలో చిక్కుకున్న 8 మందిని బయటకు తెచ్చేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నామని, 11 సంస్థలకు చెందిన వివిధ రంగాల నిపుణుల పర్యవేక్షణలో ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ఇవాళ లేదా రేపటిలోగా సహాయక చర్యలు పూర్తి అవుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎస్ఎల్బీసీ సంఘటన స్థలాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించలేదని బీఆర్ఎస్ నేతలు చిలుక పలుకులు వల్లిస్తున్నారని, గతంలో కొండగట్టు బస్సు ప్రమాదం, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్ లో ప్రమాదం, శ్రీశైలం పవర్ హౌజ్‌లో ప్రమాదాలు జరిగినప్పుడు కేసీఆర్ కనీసం బయటకు రాలేదని పేర్కొన్నారు.

ఎస్ఎల్బీసీ ప్రాజెక్ట్ వయబుల్ కాదని, ఆర్థిక ప్రయోజనాలు నెరవేరవని గతంలో కేసీఆర్ మాట్లాడారని, కానీ కాళేశ్వరం లాంటి ప్రాజెక్ట్ నిర్వహణ, విద్యుత్ వినియోగానికి వేల కోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయని, దాంతో పొల్చుకుంటే ఎస్ఎల్బీసీ రూ. 4 వేల కోట్ల వ్యయంతో 20 టీఎంసీల నీటిని వాడుకుని 3 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చని, నీటిని పంపింగ్ చేయాల్సిన అవసరం లేదని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు మానుకోవాలని, శవ రాజకీయాలు చేయొద్దని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు.

# గెలుపుపై 'ఆలపాటి' ధీమా!

**మంగళగిరి, మహానాడు:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుపై ఆలపాటి రాజేంద్రప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. 68 శాతం ఓటింగ్ జరగడంపై రాజేంద్రప్రసాద్ హర్షం వెలిబుచ్చారు. చంద్రబాబు పాలన ప్రజా పాలన కాబట్టే తమకు గెలుపునందించబోతున్నారని ఆలపాటి రాజ తెలిపారు. ప్రత్యర్థులెవరనేది కాదు... ప్రగతికి ఓటేయాలని మేము నినదించామని చెప్పారు. టీడీపీ నేతలతో కలిసి గురువారం కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికల్లో తనకు సహకరించిన కూటమి నేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు , ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ లు పాల్గొన్నారు.



# మమ్మల్ని అడిగి హామీలు ఇచ్చారా?

- రేవంత్‌కు 'సిస్టం' తెలీదు!
- సీఎం వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపాటు

**హైదరాబాద్, మహానాడు:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మమ్మల్ని అడిగి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారా? ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీ ప్రభుత్వం డబ్బులు ఇస్తేనే అభివృద్ధి పనులు చేస్తానని చెప్పాడా.. ప్రాజెక్టులకు రూపకల్పన చేశాడా? రాష్ట్రాలు ఇలా బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేయడం ఎంతవరకు సబబు. లేనిది ఉన్నట్టుగా చెప్పడం అలవాటైంది. రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి అనేక ప్రాజెక్టులను ఎప్పటికప్పుడు వివిధ విభాగాలతో మాట్లాడి, ఉత్తరాలు రాస్తూ అభివృద్ధి పనులు జరిగేలా చూస్తున్నాను. ఇవాళ బెదిరింపు రాజకీయాలు చేస్తే ఎవరు భయపడేవారు లేరు. రేవంత్ రెడ్డి మాటలను నమ్మేవారు ఎవరూ లేరు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డిని నమ్మి ఇపుడు ఆయన ఎలాంటి గాలి మాటలు మాట్లాడుతారో ప్రజలు అర్థం చేసుకున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఇంకా, ఏమన్నారంటే...

నేనేం ఆయన, కాంగ్రెస్ పార్టీ దయాదాక్షిణ్యాలతో పార్లమెంట్‌లోకి రాలేదు.. నేను తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారీని. రేవంత్ మాటలకు నేను జవాబుదారీని కాదు. ముఖ్యంగా ఒక్క విషయంలో అయినా ఆయనకు దమ్ము, ధైర్యం ఉంటే నేను ఒక్క ప్రాజెక్టును అడ్డుకున్నట్టు నిరూపించాలని సవాలు చేస్తున్నాను. చేతకాని ముఖ్యమంత్రి, దమ్ము లేని ముఖ్యమంత్రి, మాటలు చెప్పి చేతులు



దులుపుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తే ఎలాంటి ఆర్థిక ప్రణాళిక చేస్తారో కూడా ఓ కార్యాచరణ లేదు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి ఎలా డబ్బులు తెచుకుంటారో కూడా ఆయనకు ఓ క్లారిటీ లేదు. ఇటీవలే ప్రాజెక్టును కేంద్రానికి పంపారు. అది అన్ని మినిస్ట్రీలకు సర్క్యులేట్ చేయాల్సి ఉంటుంది. ఏదో ఇలా పంపగానే అలా అయిపోదు. దానికో సిస్టం ఉంటుంది. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఎలాంటి అవగాహన లేకుండా దుందుడుకుగా మాట్లాడుతున్నారు.

# ఇక లోక్‌సభ సీట్లు 848?

(ఏ.బాబు)

దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్ విభజన 2026లో జరగాల్సి ఉంది. ఈ భారీ ప్రక్రియ తర్వాత రాష్ట్రాల్లో లోక్ సభ, అసెంబ్లీ సీట్లలో పెను మార్పులు రాబోతున్నాయి.

ఇందులో అత్యధికంగా ఉత్తరాది రాష్ట్రాలు లబ్ది పొందడం ఖాయంగా తెలుస్తోంది. జనాభా ఆధారంగా జరిగే పునర్ విభజన కారణంగా దక్షిణాది రాష్ట్రాలకు భారీ నష్టం తప్పదన్న అంచనాలు ఉన్నాయి. దీంతో ఇప్పటికే ఆ మేరకు భయాలు మొదలయ్యాయి. అయితే కేంద్రం అంచనాల ప్రకారం వివిధ రాష్ట్రాల్లో పెరిగే సీట్ల సంఖ్య ఇలా ఉంది.

### 2026 తర్వాత పెరిగే లోక్ సభ సీట్లివే ? రాష్ట్రాల వారీగా ఇలా..!

భారత దేశ పటంలో పైన ఉన్న జమ్మూ కాశ్మీర్ లో ఎంపీల సంఖ్య 9కి పెరుగుతుంది. హిమాచల్ ప్రదేశ్ లో 4, పంజాబ్ లో 18, ఉత్తరాఖండ్ లో 7, హర్యానాలో 18, ఢిల్లీలో 13, యూపీలో 143, రాజస్తాన్ లో 50, గుజరాత్ లో 43, మధ్యప్రదేశ్ లో 52, జార?ండ్ లో 24, బీహార్ లో 79, ఛత్తీస్ ఘడ్ లో 19, పశ్చిమ బెంగాల్ లో 60, సిక్కింలో 1, అరుణాచల్ ప్రదేశ్ లో 2, అస్సోంలో 21, నాగాలాండ్ లో 1, మణిపూర్ లో 2, మిజోరంలో 1, త్రిపురలో 2, మేఘాలయలో 2, ఒడిశాలో 28, మహారాష్ట్రలో 70, ఏపీ, తెలంగాణలో కలిపి 54, కర్నాటకలో 41, తమిళనాడులో 49, పుదుచ్చేరిలో 1, కేరళలో 20, లక్షద్వీప్ 1, గోవా 2, అండమాన్ లో 1, దాద్రానగర్ హవేలీలో 2 కాబోతున్నాయి.

మొత్తం సీట్ల సంఖ్య ప్రస్తుతం ఉన్న 543 నుంచి 848కి పెరగబోతోంది. ఇందులో ఒక్క యూపీ-బీహార్ వాటాయే 222 సీట్లు కానుంది. దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు 165, ఇతర రాష్ట్రాల్లో సీట్లు 461 కాబోతున్నాయి. దీంతో దక్షిణాదికి జరుగుతున్న అన్యాయం ఏంటో ఇట్టే అర్థమవుతోంది. ఈ నేపథ్యంలో దక్షిణాదికి అన్యాయం జరగదంటూ కేంద్రం సన్నాయినొక్కులు నొక్కుతోంది.

అయితే దీనికి విరుగుడుగా జనాభా ఆధారంగా కాకుండా ఆయా రాష్ట్రాల నుంచి వచ్చే ఆదాయం ప్రాతిపదికగా ఈ విభజన చేయాలని దక్షిణాది రాష్ట్రాలు కోరుతున్నాయి. దీనిపై కేంద్రం స్పందించడం లేదు.

అయితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందన్న ఆందోళన



అంతకంతకూ పెరుగుతున్నప్పటికీ, దక్షిణాదిలోని ఎన్డీఏ కూటమి పార్టీలు మౌనంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

జనాభా లెక్క కాకుండా, ఏ రాష్ట్రం నుంచి ఆదాయం ఎక్కువగా వస్తే ఆ రాష్ట్రాల్లో సీట్లు పెంచాలన్న డిమాండ్ ఎందుకు చేయడం లేదన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రానికి ఏమాత్రం ఆదాయం ఇవ్వని ఉత్తరప్రదేశ్‌లో భారీగా సీట్లు పెంచుతున్న కేంద్రం... అధిక ఆదాయం ఇచ్చే మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ, కర్నాటక రాష్ట్రాల్లో సీట్లు ఎందుకు పెంచరన్న చర్చకు తెరలేచింది. అయితే దీనిపై దక్షిణాది బీజేపీ నేతలు మౌనంగా ఉండటమే ఆశ్చర్యం.

# వివాహానికి సాయం కోరిన అంధ యువతికి సీఎం రూ.5 లక్షల సాయం

**అమరావతి, మహానాడు:** తన వివాహానికి సాయం కోరిన ఓ అంధ యువతికి సీఎం చంద్రబాబు రూ.5 లక్షల సాయం అందించారు. కుప్పం మండలం రాళ్లబుదుగూరుకు చెందిన ఆర్.నాగమణి అంధురాలిగా జన్మించింది. అయినప్పటికీ ఆత్మ స్థైర్యం, పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎంఏ వరకూ చదువు కుంది. ఆమె అంధురాలు కావడం, కుటుంబం ఆర్థికంగా బాగా ఇబ్బందుల్లో ఉండటంతో వివాహమవ్వడం భారంగా మారింది.

ఆ కుటుంబ దీనస్థితిని అర్థం చేసుకుని శాంతిపురం మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన భూపతి అనే



యువకుడు నాగమణిని మనువాడేందుకు ముందుకొచ్చాడు. ఇటీవల నాగమణి ముఖ్యమంత్రిని భూపతితో కలిసి వచ్చి తన వివాహానికి ఆర్థిక సాయం చేయాలని కోరింది. స్పందించిన సీఎం చంద్రబాబు వివాహ ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షలు ప్రకటించారు. బుధవారం సీఎం చంద్రబాబును కలిసి చెక్కు అందుకున్నారు. నాగమణిని వివాహం చేసుకుని తోడ్పాటుగా ఉండేందుకు ముందుకువచ్చిన భూపతిని సీఎం చంద్రబాబు అభినందించారు.

కాబోయే దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.







# ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న ఎంపీ, మంత్రి, ఎమ్మెల్యే, అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు!

**అమరావతి, మహానాడు:** ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గురువారం పలువురు ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుంటూరు గుజ్జన గుండ్ల ఉమెన్స్ పాలిటెక్నిక్ కాలేజీలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఓటువేశారు. తెనాలిలోని ఆర్.వి.ఎస్.సి.వి.ఎస్ హైస్కూల్‌లో ప్రత్తిపాటి పుల్లారావు, విజయవాడ తూర్పు నియోజకవర్గం లోని పటమట రైతు బజార్ వద్ద గల కోనేరు బసవపున్నయ్య చౌదరి హై స్కూల్ లో కేశినేని శివనాథ్, సతీమణి కేశినేని జానకి లక్ష్మితో నిలబడి ఓటు వేశారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ట్రైనింగ్ కళాశాలలో, రాష్ట్ర కార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురంలోని జూనియర్ కళాశాలలో 168 బూత్ కు వెళ్లి సుభాష్ ఓటు వేశారు. గుంటూరు స్టాల్ గర్ల్స్ హై స్కూల్ లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి ఓటు వేశారు. అలాగే, నరసరావుపేట శాసన సభ్యుడు చదలవాడ అరవింద బాబు, గుంటూరు, గుజ్జనగుండ్ల మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో కె.యస్.లక్ష్మణరావు, విజయకుమారి ఓటు వేశారు. నరసరావుపేటలో మున్సిపల్ హైస్కూల్‌లో బూత్ నెంబర్ 373లో దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ యువనేత కడియాల లలిత్ సాగర్, శాసన మండల సభ్యుడు, టీటీడీ బోర్డు నెంబర్ జంగా కృష్ణమూర్తి దాచేపల్లి జడ్పీ హైస్కూల్లో గల పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వీరపనేని యలమందరావు కూడా ఓటు హక్కును వినియోగించుకున్నారు.







# ఓటు హక్కు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి

- తెనాలిలో ఓటు హక్కు వినియోగించుకున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

**తెనాలి, మహానాడు:** ఓటు హక్కు విలువ తెలిసిన వాళ్ళం కాబట్టి ఢిల్లీలో ఎన్ని ముఖ్యమైన పనులు ఉన్నా కేంద్ర మంత్రులతో సమావేశాలు ఉన్నా అన్నిటినీ పక్కనపెట్టి నేను నా ఓటు వేయడానికి వచ్చాను." అని గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ అన్నారు. ఉమ్మడి గుంటూరు కృష్ణాజిల్లాలలో గురువారం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కేంద్ర మంత్రి పెమసాని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. తెనాలిలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హై స్కూల్ లో ఆయన తన ఓటు వేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. మేధావులు, విజ్ఞానవంతులు, సమాజ శ్రేయస్సు కోరే ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటు వెయ్యటానికి ఒక్క గంట సమయం వేచించాలని కోరారు. పట్టభద్రులు వేసే ఈ ఓటు విలువ 6ఏళ్ల అభివృద్ధికి ఉత్తమిస్తుందని గుర్తు చేశారు.



జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, ఫిబ్రవరి 2025 ||

## ప్రతిఒక్కరు క్రియాశీలకంగా ఉండాలి

◆ **మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ**

**గుంటూరు, మహానాడు:** కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు హక్కును మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పేరుకు మాత్రమే పట్టభద్రుల ఎన్నికలు అన్నట్టుగా ఉన్నాయి. సాధారణ ఎన్నికల్లో సామాన్యుడు సైతం ఓటు హక్కు వినియోగించుకుంటాడు. సాధారణ ఎన్నికల్లో ఎక్కువశాతం పోలింగ్ జరుగుతుంది, కానీ పట్టభద్రుల ఎన్నికల్లో తక్కువశాతం ఓటు నమోదు కావడం గమనార్హం.

సాధారణ ఎన్నికల్లో తక్కువ శాతం ఇన్ వ్యాల్యూడ్ ఓట్లు ఉంటాయి. కానీ పట్టభద్రుల ఎన్నికల్లో ఇన్ వ్యాల్యూడ్ ఓట్లు ఎక్కువశాతం ఉంటున్నాయి. దీనిపై పట్టభద్రులైన ప్రతిఒక్కరూ పునరాలోచించుకోవాల్సించిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజాస్వామ్యం మనగలగాలి అంటే ప్రతి ఒక్కరు క్రియాశీలకంగా ఉండాలని శివాజీ సూచించారు.





## పోలింగ్ కేంద్రం వద్ద పీడీఎఫ్ అభ్యర్థికి ఓటేయాలని పోస్టర్లు!

**గుంటూరు, మహానాడు:**
గుంటూరులో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ వేళ ఉద్రిక్తత చోటు చేసుకుంది. నగరంలోని పాలిటెక్నిక్ కాలేజీ వద్ద పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు తరఫున టెంట్ ఏర్పాటు చేసి, ఆయనకు ఓటేయాలని పోస్టర్లు అంటించారు. దాంతో టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. పీడీఎఫ్ చర్యలు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ మేరకు పోలింగ్ అధికారులు పోస్టర్లను తొలగించారు.

## బదిలీ అయిన పొగాకు బోర్డు ఈడీకి ఘన సత్కారం

**గుంటూరు, మహానాడు:**
గుంటూరు పొగాకు బోర్డు కార్యాలయంలో ఈడీగా పనిచేస్తూ బదిలీ అయిన అద్దంకి శ్రీధర్ బాబును గురువారం ఏపీ విశ్రాంత పోలీస్



అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పెద నందిపాడు విద్యాసంస్థల చైర్మన్ కాళహస్తి సత్యనారాయణ శాలువా తో పుష్ప గుచ్ఛం అందచేసి సత్కరించారు. పొగాకు బోర్డులో శ్రీధర్ బాబు కార్యదర్శిగా, ఈడీగా, ఇన్‌చార్జి చైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన హయాంలో పొగాకు రైతులకు మెరుగైన ధరలు లభించాయి. ఉత్తరాఖండ్ క్యాడర్ కు చెందిన శ్రీధర్ బాబు డిప్యూటేషన్ పూర్తి కావడంతో ఆయన తిరిగి ఆ రాష్ట్రానికి వెళ్తున్నారు. ఈ సందర్భంగా కాళహస్తి మాట్లాడుతూ శ్రీధర్ బాబు ఉద్యోగులకు, వ్యాపారులకు, రైతులకు అనుసంధాన కర్తగా వ్యవహరించారని ప్రశంసించారు.

## 'గీతం'లో కెరీర్ ఫెయిర్!

◆ **10వేల మంది యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు**

◆ **పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి నారా లోకేష్**

**అమరావతి, మహానాడు:** విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో మార్చి 5, 6 తేదీల్లో నాస్కామ్, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా కెరీర్ ఫెయిర్ నిర్వహించనున్నారు. ఈ కెరీర్ ఫెయిర్‌లో ఐటీ, ఐటీఈఎస్ 49 కంపెనీలతో యువతీ, యువకులకు సుమారు 10వేల ఉద్యోగ




అవకాశాలు కల్పించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ ను మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. 2024, 2025 ఏడాదుల్లో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ, యువత రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో నాస్కామ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఉప్మిత్ సింగ్, నేషనల్ లీడ్ ఉదయ్ శంకర్, ఏపీ లీడ్ ప్రవీణ్ కుమార్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు వేసిన ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లి, మహానాడు:** పట్టణం తాలూకా సెంటర్ వద్ద గల జడ్పీ గర్ల్స్ హై స్కూల్‌లో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ. అనంతరం ఆయన సత్తెనపల్లి పట్టణం, రాజుపాలెం మండలం లోని పోలింగ్ బూత్ లను సందర్శించారు.



## మహిళా ఉత్పత్తులకు అధిక ఆదాయం కల్పించండి

◆ **సమీక్షా సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**అమరావతి, మహానాడు:** స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధి, రైతు ఉత్పత్తి సంస్థల (ఎఫ్‌పిఓల) సభ్యుల ఉత్పత్తులకు విలువ జోడించి అధిక ఆదాయం పొందేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం సచివాలయంలోని ఐదో బ్లాక్ లోని తన కార్యాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు, ఫాంవేద, మిల్లెట్ బ్యాంక్, క్యాపిటల్ మేనేజ్మెంట్ సర్వీస్, ఫ్లిప్ కార్ట్ కంపెనీలతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాల సభ్యులైన మహిళలు వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారని, వాటికి విలువ జోడించి అత్యధిక ఆదాయం పొందేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తగిన కార్యాచరణతో ముందుకు రావాలని సూచించారు.

ఆయా సంస్థల ప్రతిపాదనలపై చర్చించారు. త్వరలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) తో ఆయా కంపెనీలు ఎంవోయూలు చేసేందుకు సమావేశంలో నిర్ణయించారు. ఉత్పత్తులకు అధిక ఆదాయం పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఈ సమావేశంలో సెర్ప్ సీఈవో కరుణ, డైరెక్టర్ పద్మావతి, ఐఏఎం బెంగళూరు ప్రొఫెసర్



త్రిలోచనా శాస్త్రి, మిల్లెట్ బ్యాక్స్ సీఈవో విశాల, క్యాపిటల్ మేనేజ్మెంట్ సర్వీసెస్ సీఈవో రజిని, డైరెక్టర్ హెచ్ ఎస్ విశ్వనాథ్, ఫ్లిప్కార్ట్ ప్రాజెక్ట్ హెడ్ దీపూజ్యోషి తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు గౌరవ వేతనం పొందిన మౌజన్లు, ఇమాములు



◆ **సీఎం చంద్రబాబుకు మైనారిటీ మంత్రి ఫరూక్ కృతజ్ఞతలు**

**అమరావతి, మహానాడు:** రాష్ట్రంలో ఇమాములు, మౌజాన్లకు ఆరు నెలల గౌరవ వేతనం చెల్లింపు ప్రక్రియ ప్రభుత్వం పూర్తి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 5,000 మంది ఇమాములు, 5,000 మౌజాన్లకు గౌరవ వేతనాలను చెల్లించేందుకు ఈనెల 18వ తేదీన ప్రభుత్వం రూ. 45 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆరు నెలలకు సంబంధించిన గౌరవ వేతనం చెల్లింపు ప్రక్రియ పూర్తయినట్టు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అమరావతిలో గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరు నెలలకు సంబంధించిన గౌరవ వేతనాన్ని ఇమాములు, మౌజన్లకు చెల్లించడంతో రంజాన్ మాసంకు ముందుగా చంద్రన్న కానుక అందిందన్న ఆనందంలో వారు ఉన్నారని అన్నారు. వారందరి తరఫున సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు మంత్రి ఫరూక్ వెల్లడించారు.


## బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పవన్‌కు మంత్రి దుర్గేష్ అభినందనలు!

**రాజమహేంద్రవరం, మహానాడు:**
ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్ లోని అంతర్జాతీయ క్రీడా సముదాయం హల్ద్వానీలో జనవరి 28 నుండి ఫిబ్రవరి 14 వరకు జరిగిన ప్రతిష్ఠాత్మక 38వ జాతీయ క్రీడల్లో ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కర్రి సాయి పవన్ ప్రతిభ కనబరిచారు. కాంస్య పతకం సాధించిన పవన్‌ను మంత్రి దుర్గేష్ గురువారం అభినందించారు. ఈ మేరకు కర్రి సాయి పవన్ తన తండ్రి నాగేశ్వర రావుతో మంత్రిని కలిశారు. తాను సాధించిన కాంస్య పతకాన్ని మంత్రి కి చూపించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పవన్ తన క్రీడా ప్రతిభతో రాష్ట్రంతో పాటు తూర్పుగోదావరి జిల్లాకు మంచి పేరు తీసుకురావడం గర్వంగా ఉందన్నారు. క్రీడా రంగంలో పవన్ మరింత ఉన్నతస్థాయికి చేరాలని ఆశీస్సులు అందించారు. ఆట పట్ల పవన్ ప్రదర్శించిన, నిబద్ధత ప్రతి ఒక్క క్రీడాకారుడికి



స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. ఈ సంద ర్భంగా పవన్ తల్లిదండ్రులను మంత్రి దుర్గేష్ అభినందించారు.



## టన్నెల్లో చిక్కుకున్న వారు చనిపోయారు

◆ **కాంట్రాక్టర్ జై ప్రకాష్ గౌర్**

**హైదరాబాద్, మహానాడు:** ఎస్ఎల్బీసీ టన్నెల్లో చిక్కుకున్న వారు చనిపోయారని జేపీ అసోసియేట్స్ యజమాని జై ప్రకాష్ గౌర్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడారు. ఆరు రోజులుగా టన్నెల్లో చిక్కుకున్న 8 మంది ఆచూకీ కోసం ఆపరేషన్ కొనసాగించారు. అయితే ఇవాళ టన్నెల్ చివరి వరకు వెళ్లినా వారి ఆచూకీ లభించలేదు. బురదలో కూరుకుపోయి చనిపోయి ఉంటారని, వారి మృతదేహాలు బయటకు తీశాక ప్రాజెక్ట్ కంటిన్యూ చేయాలో వద్దో మంత్రులతో మాట్లాడినట్లు ప్రకాష్ తెలిపారు.



**వినుకొండ మండలం నడిగడ్డ గ్రామ సమీపంలో మగ బిడ్డను రోడ్డు పక్కన ముళ్ళ పొదల్లో గుర్తుతెలియని వ్యక్తులు విడిచిపెట్టారు. 108 కాల్ సెంటర్‌కి సమాచారం అందించగా 108 సిబ్బంది వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్టు తహశీల్దార్ సురేష్ నాయక్ తెలిపారు.**





**కావలి పట్టణానికి చెందిన సైదపేట మునిమోక్షిత అతి చిన్న వయసులో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. శస్త్రచికిత్సకు రూ.25 లక్షలు ఖర్చవుతుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి కి తెలిపారు. ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ. 10 లక్షలు మంజూరు చేయించి, అండగా నిలబడ్డారు.**

**ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెనాలి రావి సాంబయ్య పురపాలక బాలుర ఉన్నత పాఠశాల నందు ఓటు హక్కు వినియోగించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**






**శాసనమండలి కృష్ణ- గుంటూరు పట్టభద్రుల ఎన్నికలలో మచిలీపట్నంలోని హైని స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన పత్ని విజయలక్ష్మీతో కలిసి కలియుగ ఇష్ట దైవం తిరుమల తిరుపతి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు.**



**విజయవాడ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు**

9

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, ఫిబ్రవరి 2025 ||






# కదిరిలో గొడ్డలి కొని జగన్ చేతికి ఇచ్చి పంపిస్తారా ఏంది?

- చింపేయడానికి అది సాక్షి స్టుడియో కాదు.. అసెంబ్లీ
- పులివెందుల కథలు వినిపిస్తే అసెంబ్లీలో వినరు
- అధ్యక్షా అని రఘు రామ రాజును పిలిచే గుండె ధైర్యం వుందా అని కనుక్కో



గొడ్డలింటి ఆణిముత్యం అవినాష్ రెడ్డి గారికి,

"పులివెందులకు ఉప ఎన్నిక కాదు.. దమ్ముంటే మంగళగిరి, కుప్పంలో ఉప ఎన్నిక నిర్వహించండి" అని డిమాండ్ చేస్తున్నావు. ఏమి..? అక్కడ అక్కయ్యలు ఇద్దరూ వచ్చి మళ్లీ నీ గొడ్డలి గురించి ఉమ్మేస్తారని భయపడు తున్నావా? పులివెందుల కూడా పోతే, నువ్వు రాజీనామా చెయ్యి. నేను కడప నుండి ఎంపీగా వెళ్లి ఢిల్లీలో పాదాలు పట్టుకొంటా అని జగన్ అడుగుతాడని భయమా?

"సూపర్ సిక్స్ పథకాలను రెఫరెండంగా తీసుకుని ఎన్నికలకు వెళ్దాం" అని అడిగావు. ఎలాగూ దాని మీద 2029లో ఉంటుంది. అంత తొందరెందుకు? ఇప్పుడు బటన్ నొక్కుడు మీద కట్టిన బొప్పి తడుముకొంటూ ఆస్వాదించండి.

"ప్రతిపక్షాన్ని గుర్తించి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి" అంటూ అడిగావు. మీ పార్టీకి ప్రజలు అంత సినిమాలేదని కూర్చోబెట్టారు. గుడి మెట్ల దగ్గర అడుకొంటున్నట్లు మీ అన్న అసెంబ్లీలో బ్యాచ్ పెట్టి, బిక్షం లెక్కన అడుక్కోవటానికి సిగ్గెయ్యటం లేదా?

"ప్రతిపక్ష హోదాతో జగన్ అసెంబ్లీకి వెళ్తే వాళ్లకు సినిమా కనబడుతుంది" అని అంటున్నావు. మీ అత్త కూతురు, నువ్వు కలిసి, కదిరిలో గొడ్డలి కొని, జగన్ చేతికి ఇచ్చి పంపిస్తారా ఏంది? చింపేయడానికి అది సాక్షి స్టుడియో కాదు. అది అసెంబ్లీ.. మన పకోడీగాడికి ఎన్ని స్క్రిప్టు వ్రాసి ఇచ్చి పంపినా చూసి కూడా చదవలేడు. ట్రోలర్స్‌కు పండగ అవుతాడు. అవన్నీ పకోడీ పొట్లాలకు ఇవ్వాల్సిందే.

"జగన్ కు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా కూటమి కుట్ర చేస్తోంది" అని ఆరోపించావు. వాళ్లేమన్నా గొడ్డలితో నరికేసి గుండెపోటు కథలు చెప్పారా, నువ్వూ.. నీ మరదలి మీడియాలోలా? అది జనం ఇచ్చేది.

"ప్రతిపక్ష హోదా ఇస్తే తాము అడిగే ప్రశ్నలకు భయపడే ఇవ్వడం లేదు" అని అన్నావు. మీ అన్న సీఎం అయినా.. 23 మందితో వచ్చిన చంద్రబాబును చూసి చలి జ్వరం తెచ్చుకొని, బూతు మందతో వ్యక్తిత్వ హననం చేశాడు. ఇప్పుడు వున్న 11 మందిలో మీ అన్నకు ఆసరాగా ఒక్క బూతుగాడు కూడా గెలవలేదు. మీ వాడి ప్రశ్నలకు అక్కడి నుండి ఎదురయ్యే ప్రశ్నలకు కూతురే మా బాబాయిని చంపేసింది అనే పులివెందుల కథలు వినిపిస్తే అసెంబ్లీలో వినరు. అధ్యక్షా అని రఘు రామ రాజును పిలిచే గుండె ధైర్యం వుందా అని కనుక్కో. తరువాత ఈయన ప్రశ్నల గురించి నువ్వు మురిసిపోదువు.

"ఉన్నది ఒకే ప్రతిపక్షం.. 11 సీట్లు వచ్చాయన్నది ముఖ్యం కాదు" అన్నావు. నరికేసిన బాబాయి శవానికి కుట్లేస్తే గుండెపోటు వచ్చినట్లు భావిస్తారని, వెంటనే పాతేద్దామని శవపేటిక తెప్పించినంత సులువుకాదు. జనసేనకు కూడా మీకంటే ఎక్కువ సీట్లు వచ్చాయి. మీకు ఇవ్వాలని మీ తాత రాజ్యాంగంలో లేదు.

అయినా నువ్వు ఇలా మాట్లాడడం, అవతల మీ అక్కయ్యలు వచ్చి నీకు తలంటడం చాలా చాలా చాలా చాలా బావుంటుంది. ఊరికే వుంటే ఊరా పేరా? అవతల రెండు కేసులు గొడ్డలి కేసులో మొదలైంది. అది సీబీఐ దర్యాప్తు కాదు అవినాశనం. రాష్ట్ర పోలీసులు చేస్తున్నది. మనం అప్పుడు తెలంగాణా పంపేసిన అప్పటి దర్యాప్తు అధికారి మళ్లీ మన ఆంధ్రాకు వస్తున్నాడు. నీకు భయం వేసి, డైవర్షన్ కోసం అన్నకు అండగా నిలబడ్డావు. నీ కోసం బాబాయి కేసులో అండగా నిలబడిన రాక్షసత్వం మీ అన్నది. గొడ్డలింటి బ్రదర్స్ అనుబంధం, సంబంధాలు భలే వున్నాయి బ్రో.

- చైతన్య

# పోలింగ్ తీరును పరిశీలించిన మంత్రి లోకేష్

**అమరావతి, మహానాడు:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన అనంతరం టీడీపీ కేంద్ర కార్యాలయానికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చేరుకున్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, ఉభయగోదావరి, కృష్ణ-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. పోలింగ్ సరళిపై అందుబాటులోని పార్టీ నేతలతో వార్ రూమ్‌లో మంత్రి సమావేశమయ్యారు. పోలింగ్ తీరుతెన్నులు, పార్టీ నేతలు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని ఇంఛార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు ఆదేశించారు. పోలింగ్ తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నేతలకు సూచనలు ఇస్తున్నారు.







# వైభవంగా మల్లేశ్వర స్వామి రథోత్సవం, విశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవం





- ఆధ్యాత్మిక ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేష్
- ఘనస్వాగతం పలికిన ఆలయ నిర్వాహకులు

**మంగళగిరి, మహానాడు:** శివరాత్రి వేడుకల్లో భాగంగా మంగళగిరిలోని బ్రహ్మసూత్రం గల శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రథోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. బాణసంచా కాల్చి తమ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం రథోత్సవంలో మంత్రి ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తుల శివనామ స్మరణ, అశేష జనసందోహం మధ్య రథాన్ని లాగారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కృష్ణాయపాలెంలో విశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవం

మంగళగిరిలో వేడుక అనంతరం కృష్ణాయపాలెంలోని శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు నిర్వాహ కులు ఘనస్వాగతం పలికారు. అనంతరం విశ్వేశ్వర స్వామి వారిని మంత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. విశ్వేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సంలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రజలతో కలిసి ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.









జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 28, ఫిబ్రవరి 2025 ||



## వెంచ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రీమియర్‌గా 'ది ఐ'



ప్రఖ్యాత భారతీయ నటి శ్రుతి హాసన్ డాఫ్నే ష్మోన్ దర్శకత్వం వహించిన సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఐ'తో గ్లోబల్ ఆడియెన్స్‌కు పరిచయం కాబోతోన్నారు. ఫిబ్రవరి 27 నుండి మార్చి 2, 2025 వరకు జరిగే హర్రర్, సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ చిత్రాలను 5వ వెంచ్ ఫిల్మ్ ఫెస్టివల్ గ్రాండ్‌గా జరగబోతోంది. ఈ ఈవెంట్ ప్రారంభ ఫీచర్‌గా 'ది ఐ' చిత్రం ఇండియా తరుపున ప్రీమియర్ కానుంది. డయానా (శృతి హాసన్) తన భర్త ఫెలిక్స్ (మార్క్ రౌలీ) కోసం చేసే ప్రయాణమే ఈ 'ది ఐ'. చనిపోయిన తన భర్తను మళ్లీ తిరిగి తీసుకు వచ్చేందుకు వచ్చే ప్రయత్నాలు ఎంతో ఆసక్తిగా ఉండబోతోన్నాయని టీజర్ చూస్తేనే అర్థం అవుతోంది. తన భర్తను వెనక్కి తిరిగి తెచ్చుకునేందుకు భార్య చేసి త్యాగాలు ఏంటి? ప్రయత్నాలు ఏంటి? అన్నది ఆసక్తికరంగా మారింది.

గ్రీస్, ఏథెన్స్, కోర్ఫులోని అందమైన లోకేషన్‌లో చిత్రీకరించిన సీన్లు ఆడియెన్స్‌ను మెప్పించేలా ఉన్నాయి. 2023లో లండన్ ఇండిపెండెంట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో, గ్రీక్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో'ది ఐ'ని ప్రదర్శించిన తర్వాత ప్రాజెక్ట్‌పై అందరిలోనూ మరింతగా ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా శృతి హాసన్ మాట్లాడుతూ.. 'సైకలాజికల్ థ్రిల్లర్‌లు ఎప్పుడూ నన్ను ఆకర్షిస్తూనే ఉంటాయి. మానవ భావోద్వేగాలు, దుఃఖం, అతీంద్రియ శక్తులు వంటి కాన్సెప్ట్‌లతో తీసే సినిమాలంటే నాకు చాలా ఇష్టం. మొత్తం మహిళల నేతృత్వంలోని ప్రొడక్షన్ హౌస్‌లో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించడం విశేషం. చలనచిత్ర పరిశ్రమలో మహిళలకు మద్దతు ఇవ్వాలనే నా అభిరుచికి అనుగుణంగా ఈ ప్రాజెక్ట్ ఉంటుంది' అని అన్నారు.



## ధనుష్, నాగార్జున, శేఖర్ కమ్ముల జూన్ 20న 'కుబేర'

సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న, నేషనల్ అవార్డ్-విన్నింగ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల హైలీ యాంటిసిపేటెడ్ పాన్-ఇండియన్ మూవీ 'కుబేర' మేకర్స్ రిలీజ్ డేట్ లాక్ చేశారు. కుబేర జూన్ 20, 2025న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న, జిమ్ సర్భ్‌లతో కూడిన అద్భుతమైన తారాగణంతో కుబేర భారతీయ సినిమాలో గేమ్-ఛేంజర్‌గా నిలుస్తుందని హామీ ఇస్తోంది.

క్యారెక్టర్ బేస్డ్ నరేటివ్స్‌తో అదరగొట్టే శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని నెవర్ బిఫోర్ గా తీర్చిదిద్దారు, ఇది ఈ సంవత్సరంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఒకటిగా నిలిచింది. రిలీజ్ డేట్ పోస్టర్ నాగార్జున, ధనుష్‌లను ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్స్ తో అద్భుతంగా ప్రజెంట్ చేసింది, జిమ్ సర్భ్ బ్యాక్ డ్రాప్ లో నిలబడి ఉండడం ఇంట్రెస్టింగ్ గా ఉంది. సినిమాలోని నాలుగు ప్రధాన పాత్రలను పరిచయం చేసిన ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ అద్భుతమైన స్పందన తో అంచనాలను పెంచింది. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎస్‌విసిఎల్‌ఎల్‌పి పై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని హై బడ్జెట్ హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తున్నారు.

## అబ్సెషన్ మూవీ పోస్టర్ లాంచ్



న్యూ విజన్ సెల్యూలైడ్స్ బ్యానర్ పై రవి నాలమ్ నిర్మిస్తున్న తాజా చిత్రం అబ్సెషన్ టైటిల్, పోస్టర్ లాంచ్ కార్యక్రమం జరిగింది. ఈ చిత్రాన్ని రాకేష్ శ్రీపాద దర్శకత్వం వహిస్తున్నారు. క్రైమ్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్నట్లు పోస్టర్ చూస్తుంటే అర్థం అవుతుంది. టైటిల్ పోస్టర్ ను ప్రముఖ కొరియోగ్రాఫర్ గణేష్ మాస్టర్ చేతుల మీదుగా అవిష్కరించారు. పోస్టర్ లాంచ్ చేసిన అనంతరం మూవీ యూనిట్ తో గణేష్ మాస్టర్ మాట్లాడారు. అబ్సెషన్ టైటిల్ చాలా కొత్తగా ఉందని, హాలీవుడ్ పేరును తలపించేలా ఉందని, పేరు మాత్రమే కాకుండా పోస్టర్ కూడా అలానే ఉందని పేర్కొన్నారు. అనీష్ రాజ్ దేశ్ ముఖ్ అందించే సాంగ్స్ కచ్చితంగా బాగుంటాయని, త్వరగా పాటలు పూర్తి అయితే వినాలని ఉందని అన్నారు. డైరెక్టర్ రాకేష్ శ్రీపాద విజన్ ఎలా ఉంటుందో ఒక పోస్టర్ తోటే చెప్పారు అని తెలిపారు. సినిమాను అద్భుతంగా తెరకెక్కించి మంచి విజయం సాధించాలని గణేష్ మాస్టర్ పేర్కొన్నారు.

## రాజా దుస్సా దర్శకత్వంలో 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే'

తెలుగు సినిమా ఇండస్ట్రీ లోనే తొలి ప్రయత్నంగా, దేశముదురు హీరోయిన్ హన్సిక మోత్వాని లీడ్ రోల్ గా "105 మినిట్స్" అనే సింగిల్ షాట్, సింగిల్ క్యారెక్టర్ మూవీతో ఒక వినూత్న ప్రయోగం చేసిన దర్శకుడు రాజా దుస్సా, ఇప్పుడు తన తదుపరి చిత్రంగా తెలంగాణ యాస భాష నేపథ్యంలో " అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే " అంటూ పూర్తి వినోదాత్మకమైన చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాని " శ్రీ రామకృష్ణ సినిమా " బ్యానర్ లో గాలి కృష్ణ నిర్మిస్తున్నారు. సహ నిర్మాతలుగా నాంపల్లి సోమాచారి, అలూరి రాజిరెడ్డి , రూప కిరణ్ గంజి వ్యవహరిస్తున్నారు. ఈ కథ విషయానికి వస్తే 1980లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వరంగల్ జిల్లాలో జరిగిన ఒక యదార్థ సంఘటనను తీసుకొని ఈ చిత్రాన్నిపూర్తి వినోదాత్మకంగా రూపొందిస్తున్నామని దర్శకుడు రాజా దుస్సా వెల్లడించారు. ఈ చిత్రానికి కెమెరామెన్ గా వేణు మురళీధర్.వి, ఎక్జుక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా కార్తికేయ శ్రీనివాస్ (వాసు) పని చేస్తున్నారు. నటినటుల్ని మిగతా సాంకేతికవర్గాన్ని త్వరలోనే తెలియజేస్తామని చిత్రం యూనిట్ తెలిపింది.




దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం లక్కీ భాస్కర్. సితార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. అక్టోబర్ 31, 2024 న విడుదలైన థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకుల మెప్పు పొందింది. బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపించిన లక్కీ భాస్కర్, దుల్కర్ సల్మాన్ కెరీర్ లోనే అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రంగా నిలిచింది. తాజాగా ఈ చిత్రం మరో చరిత్ర సృష్టించింది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో లక్కీ భాస్కర్ చిత్రం స్ట్రీమింగ్ అవుతోంది. ఈ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు బ్రహ్మరథం పడుతున్నారు. దాంతో నెట్‌ఫ్లిక్స్‌లో వరుసగా 13 వారాల పాటు ట్రెండ్ అయిన మొదటి దక్షిణ భారతీయ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. కట్టిపడేసే కథా కథనాలు, నటీనటుల అద్భుత నటన, సాంకేతిక నిపుణుల పనితీరు.. ఇలా అన్నీ తోడై లక్కీ భాస్కర్ ను గొప్ప చిత్రంగా నిలిపాయి. అందుకే అప్పుడు థియేటర్లలో, ఇప్పుడు ఓటీటీలో ఈ స్థాయి స్పందన లభిస్తోంది. ఈ చిత్రం యొక్క వైవిధ్యమైన కథాంశం, భాషతో సంబంధం లేకుండా అందరి మన్ననలు పొందుతోంది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం కథకి ప్రాణం పోసింది. ఇక భాస్కర్ పాత్రలో ఒదిగిపోయిన దుల్కర్ సల్మాన్, తన అత్యుత్తమ నటనతో సినిమాని మరో స్థాయికి తీసుకెళ్ళారు.

## చరిత్ర సృష్టించిన లక్కీ భాస్కర్



## చైనాలో ఎంబిబిఎస్ చేయక తప్పలేదు

ప్రొఫెషనల్ గా ఒకటి చేసి సినిమాల మీద ఆసక్తితో వెండితెరకు పరిచయమయ్యే వారు చాలామంది ఉంటారు. ముఖ్యంగా డాక్టర్ అవుదామని కొందరు యాక్టర్ అవుతారు కానీ ఈమధ్య చాలా మంది డాక్టర్ అయ్యి కూడా యాక్టర్ అవుతున్నారు. హీరోయిన్స్ అంతా ఎక్కువగా డాక్టర్ కోర్స్ చేస్తూ సినిమాల్లోకి వస్తున్నారు. కొందరు రెండిటినీ ఒకేసారి చేస్తున్న వారు ఉన్నారు. మన స్టార్ హీరోయిన్స్ సాయి పల్లవి, శ్రీలీల కూడా ఓ పక్క డాక్టర్ చదువుతూ సినిమాలు చేస్తున్నారు. ఐతే ఈమధ్య తెలుగు సినిమాల్లో తరచు కనిపిస్తున్న ఒక హీరోయిన్ కూడా ఎంబిబిఎస్ చేసి సినిమాల్లోకి ఎంటర్ అయ్యింది. నటిగా తనని తాను ప్రూవ్ చేసుకునేందుకు ఎలాంటి పాత్రలు వచ్చినా చేస్తూ వస్తుంది కామాక్షి భాస్కర్ల. సినిమా పట్ల ఆమెకు ఉన్న అంకితభావం ఎలాంటిదో ఆమె చేస్తున్న పాత్రలు అందుకు ఆమె తీసుకుంటున్న కేర్ చూస్తే తెలుస్తుంది. పొలిమేర సీరీస్ లతో మెప్పిస్తున్న అమ్మడు వరుస సినిమాలతో బిజీగా ఉంది. కామాక్షి భాస్కర్ల రీసెంట్ గా తన ఎంబిబిఎస్ విషయాలను పంచుకుంది. చైనాలో ఎంబిబిఎస్ చేస్తున్న టైం లో అక్కడ ఏది దొరికితే అది తినేశానని అన్నది కామాక్షి. ఎక్కడికి వెళ్లినా అక్కడ వారు ఏం తింటారో అది తినేయడం అలవాటని. చైనాలో గ్రీనరీ అసలు ఉండదు. కూరగాయలు కూడా దొరకవు. అందుకే అక్కడ జీవులను చంపి తింటారు. ఆ టైం లోనే తనకు తేళ్లు, బొద్దింకలు తినడం అలవాటైందని అన్నారు.



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144